నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

పనులుజేయకుండ పడిపడి వంగుచు
నటనజేయువారె నప్పునంట
పనులుజేయుటందు మనసునిల్పు జనుల
జూచిరంట నేడు చులకనగను

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

----------------------


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 178 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 7-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


# మోగిన బీహార్ ఎన్నికల నగారా




## నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు




- రెండు విడుతల్లో ఎన్నికల నిర్వహణ
- నవంబర్ 14న కౌంటింగ్..అదేరోజు ఫలితాలు
- 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు
- ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు
- ఓటు వేయనున్న 7.43 కోట్ల మంది ఓటర్లు అందులో 3.92 కోట్ల పురుషులు,
- 3.50 కోట్ల మహిళా ఓటర్లు షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,
బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 6, నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్ట నున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఈ మేరకు షెడ్యూల్ ఖరారు చేసింది. పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్ లో మొత్తం 243 శాసనసభ స్థానాలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు -మిగతా 2 లో



## సుప్రీంకోర్టులో తీవ్ర కలకలం

- సీజేఐ గవాయ్‌పై షూ విసిరేందుకు యత్నించిన లాయర్
- సనాతన ధర్మాన్ని అవమానించారని నినాదాలు

న్యూఢిల్లీ
దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్ పై ఓ లాయర్ దాడికి యత్నించారు. సోమవారం ఉదయం సుప్రీంకోర్టులో కోర్టు కార్యకలాపాలు జరుగుతుండగా సీజేఐపై ఓ లాయర్ షూ విసిరేందుకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది సదరు లాయర్‌ను అడ్డుకుని బయటకు తీసుకెళ్లారు.సోమవారం ఉదయం ఓ కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. విచారణ సమయంలో డయాస్ వద్దకు వెళ్లిన సదరు లాయర్.. షూ తీసి సీజేఐపైకి -మిగతా 2 లో

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులోనే తేల్చుకోండి

### సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

- బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ కొట్టివేత
- హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా విచారించలేం
- సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ




న్యూఢిల్లీ
సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ దవే, అభిషేక్ సింఘ్వీ, ఏడీఎన్ రావు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని -మిగతా 2 లో




## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- 14న కౌంటింగ్..
- అదేరోజు ఫలితం ప్రకటన

న్యూఢిల్లీ,
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ వచ్చింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అనంతరం నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేస్తున్నట్లు పేర్కొంది. బీహార్ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు జూబ్లీహిల్స్ తదితర రాష్ట్రాల్లో పలు అసెంబ్లీ ఉప ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈనెల 13న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్లకు -మిగతా 2 లో



## రాజస్థాన్‌లో ఘోరం

- జైపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఐసియులో చెలరేగిన మంటలు
- 8మంది మృతి, ముగ్గురి పరిస్థితి విషమం
- ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు

జైపూర్
రాజస్థాన్‌లో ఘోరం జరిగింది. జైపూర్‌లోని అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి అయిన సవారు మాన్‌సింగ్ (ఎస్ఎంఎస్) ఆస్పత్రిలోని ట్రామా సెంటర్ ఐసియులో పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో ముగ్గురు మహిళలుసహా ఎనిమిది మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా వుంది. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. రాత్రి 11.20గంటల సమయంలో ఐసియులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఐసియు వార్డులోని స్టోర్ రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ ఈ దుర్ఘటనకు కారణమై వుంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ స్టోర్ రూమ్‌లో కాగితాలు, వైద్య సామాగ్రి, బ్లడ్ శాంపుల్స్ ట్యూబులు వున్నాయి. ఒక్కసారిగా పెద్దఎత్తున లేచిన మంటలు క్షణాల్లో వార్డును చుట్టుముట్టేశాయి. దాంతో ఆ వార్డంతా పొగ కమ్ముకుంది. రోగులు భయకంపితులయ్యారు. ఈ సంఘటన చోటు చేసుకున్న సమయంలో ఐసియులో, సెమీ ఐసియులో 18మంది రోగులు వున్నారు. అందులో 11మంది ఒకే వార్డులో వున్నారు. అక్కడే మంటలు -మిగతా 2 లో

## సుప్రీం కోర్టు తీర్పు శుభపరిణామం



- 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం
- ఢిల్లీలో మీడియతో మంత్రులు భట్టి, పొన్నం

న్యూఢిల్లీ,
సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును న్యాయస్థానం కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం.. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా -మిగతా 2 లో

### రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు ...
## కటింగ్ మాస్టర్

- రిబ్బన్ కట్ చేయడం లేదంటే...పథకాలు కట్ చేయడం
- మల్లన్న సాగర్ నుంచి నీళ్లు ఎలా తరలిస్తారు
- సీఎం రేవంత్‌పై ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,
రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు అని, కటింగ్ మాస్టర్ అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సిఎం తీరుపై ఎద్దేవా చేశారు. రేవంత్ జేబులో కత్తెర పెట్టుకొని మాజీ సీఎం కేసీఆర్ చేసిన పనులకు రిబ్బన్ కట్ చేస్తున్నాడని విమర్శించారు. రిబ్బన్ కత్తిరించడం లేదంటే కేసీఆర్ ఇచ్చిన పథకాలు కట్



చేయడమే రేవంత్ పని అని పేర్కొన్నారు. కాళేశ్వరం కూలిందని చెబుతున్న సీఎం -మిగతా 2 లో


# పరిశ్రమలు పెట్టే వారికి అన్నిరకాల మద్దతు

### హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ అంగీకారం



- రూ.9000 కోట్లు భారీ పెట్టుబడులకు కంపెనీ నిర్ణయం
- సీఎం రేవంత్‌తో పరిశ్రమ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్,
తెలంగాణలో పరిశ్రమలు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ ఎలి లిల్లీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ భేటీకి ఆ సంస్థ అధ్యక్షుడు ప్యాట్రిన్ జాన్సన్, లిల్లీ ఇండియా అధ్యక్షుడు విన్సెలో టుకర్, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ తదితరులు హాజరయ్యారు. హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ ముందుకొచ్చింది. రూ.9 వేల కోట్లతో ఎలాంటు, క్వాలిటీ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థను -మిగతా 2 లో



## అలా చేయకపోతే భారీ రక్తపాతమే

- ఇజ్రాయెల్, హమాస్‌కు ట్రంప్ కీలక హెచ్చరికలు

న్యూఢిల్లీ
గాజా విషయంలో ఇజ్రాయెల్, హమాస్ కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. గాజా శాంతి ప్రణాళిక విషయంలో వెంటనే ఒక నిర్ణయానికి రాకపోతే భారీ రక్తపాతం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈజిప్టు వేదికగా ఇరు పక్షాల మధ్య కీలక చర్చలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ ఈ హెచ్చరికలు చేశారు.'శతాబ్దాల నాటి ఈ సంఘర్షణను నేను నిశితంగా గమనిస్తున్నానే ఉన్నాను. సమయం చాలా విలువైంది. గాజా శాంతి ప్రణాళికపై ఇజ్రాయెల్, హమాస్ త్వరగా ముందుకు సాగాలి. అలా చేయడంలో విఫలమైతే భారీ రక్తపాతం జరుగుతుంది ' అంటూ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. హమాస్‌తో పాటు ఇతర అరబ్, ముస్లిం దేశాలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని, బందీల విడుదల, గాజాలో యుద్ధం ముగింపు వంటి అంశాలపై సానుకూల వాతావరణం నెలకొందని ఈ సందర్భంగా ట్రంప్ తెలిపారు. నేడు ఈజిప్టు వేదికగా తుది -మిగతా 2 లో

## ఎంఐఎం మాకు ఫ్రెండ్లీ పార్టీ

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తాం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్,
జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు ఫ్రెండ్లీ పార్టీ అని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం తమకు పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. జూబ్లీహిల్స్‌లో విజయం తమదే అని పీసీసీ చీఫ్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈరోజు షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 11న ఉప ఎన్నిక పోలింగ్, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరగనున్నట్లు ఈసీ వెల్లడించింది. మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. 'రెండు మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ అభ్యర్థి పేరు ఖరారవుతుంది. అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డితో -మిగతా 2 లో

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులోనే తేల్చుకోండి

(మొదటి తరువాయి)

పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసిందివసంది. దీంతో బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ లభించింది. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ని విచారించడానికి నిరాకరించింది సుప్రీంకోర్టు. తెలంగాణ హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు తెలిపారు. హైకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున... విచారణకు స్వీకరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఎలా జోక్యం చేసుకుంటుందని ప్రశ్నించింది ధర్మాసనం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, జీవో నెంబర్-9ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు స్వయంగా తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. వీరు సీనియర్ న్యాయవాదులతో ఆదివారం నుంచి మంతనాలు జరిపారు. ప్రభుత్వ వాదనలను గట్టిగా వినిపించాలని కోరారు. దీంతో ఇక ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లేందుకు దాదాపుగా మార్గం సుగమమయ్యిందని భావిస్తున్నారు.

## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మొదటి తరువాయి)

ఈనెల 21 వరకు గడువు విధించనున్నట్లు సమాచారం. అలాగే స్వీకరించిన నామినేషన్లను 22వ తేదీన పరిశీలన చేయనున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. బీహార్‌తో పాటే నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 13, నామినేషన్లకు తుది గడువు: అక్టోబర్ 21, నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 22, నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 24 పోలింగ్ తేదీ: నవంబర్ 11, ఓట్ల లెక్కింపు : నవంబర్ 14న ఉంటుంది.

## సుప్రీంకోర్టులో తీవ్ర కలకలం

(మొదటి తరువాయి)

విసిరేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది లాయర్‌ని అడ్డుకుని బయటకి లాక్కెళ్లారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఆ సమయంలో ఆ న్యాయవాది 'సనాతనానికి జరిగే అవమానాన్ని మేము సహించము..' అంటూ గట్టిగా అరిచారు. ఈ ఘటనతో కోర్టులో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. స్పందించిన సీజేఐ ఈ విషయాన్ని తనని ప్రభావితం చేయదని పేర్కొన్నారు. మిగతా లాయర్లు తమ వాదనలు కొనసాగించాలని ఆదేశించారు.

## ఎంఐఎం మాకు ఫ్రెండ్లీ పార్టీ

(మొదటి తరువాయి)

మాట్లాడుతున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిస్థితులను బట్టి మిత్రపక్షాలకు టికెట్లు ఇస్తాం. సీపీఎం, సీపీఐ, జనసమితి అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది. డిసెంబర్ నెలాఖరు వరకు కార్పొరేషన్ పదవులు భర్తీ చేస్తాం. బీసీ రిజర్వేషన్‌పై మేం పడే తపన ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఉంటుంది. అక్టోబర్ నెలాఖరులో కామారెడ్డి సభ ఉంటుంది' అని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చెప్పారు.

## అలా చేయకపోతే భారీ రక్తపాతమే

(మొదటి తరువాయి)

చర్చలు జరగనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు తొలి దశలో భాగంగా గాజాలోని బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని హమాస్‌కు కూడా పంపించినట్లు ఆయన తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికగా శనివారం వెల్లడించారు. హమాస్ నుంచి ఆమోదం లభించిన వెంటనే గాజాలో కాల్పుల విరమణ అమలులోకి వస్తుందని, ఇజ్రాయెలీ బందీలు, పాలస్తీనా బందీల మార్పిడి ప్రారంభమవుతుందని ట్రంప్ తెలిపారు. తొలి దశ ఉపసంహరణకు పరిస్థితులను సానుకూలం చేస్తామని, దీంతో 3,000 సంవత్సరాల పాలస్తీనా సంక్షోభానికి ముగింపు లభించగలదని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాజస్థాన్‌లో ఘోరం

(మొదటి తరువాయి)

తలెత్తాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక దళ అధికారులు వచ్చినా అగ్నికీలలు, దట్టమైన పొగ సహాయక చర్యలకు ఆటంకం కలిగించాయి. కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది సహాయంతో కిటికీలు, తలుపులు బద్దలు కొట్టి చాలామంది రోగులను కాపాడారు. వీధిలో పరిచిన పరుపులపై వెంటనే రోగులను పడుకోబెట్టి, వారికి ఫస్ట్ ఎయిడ్‌గా ఆక్సిజన్‌ను అందించారు. ఈ ఘటనతో ఆస్పత్రిలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఐసియులో విషమంగా వున్న రోగు లను తరలించడానికి సిబ్బంది చాలా శ్రమపడాల్సి వచ్చింది. మంటలను అదుపు చేయడానికి గంటన్నర పట్టింది. ట్రామా సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ అనురాగ్ థకడ్ మాట్లాడుతూ, ఆరుగురు రోగులు మంటల్లో చిక్కుకుపోయారని తెలిపారు.

ఆస్పత్రి భద్రతా ఏర్పాట్లపై అనుమానాలు

ఈ సంఘటనతో ఆస్పత్రిలోని భద్రతా ఏర్పాట్లుపై తీవ్రమైన సందేహాలు, ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. మంటలు వచ్చిన వెంటనే ఫైర్ అలారమ్ వ్యవస్థ సరిగా పనిచేయలేదని అక్కడి వారు చెబుతు న్నారు. పైగా ఆక్సిజన్ లైన్‌ను అనుసంధానించడంలో కూడా జాప్యం జరిగింది. తగిన మొత్తంలో అగ్నిమాపక పరికరాలు లేకపోవడంతో మంటలు త్వరిత గతిన వ్యాప్తిచెందడానికి కారణమైంది.

కుటుంబాల ధర్నా

ఈ ప్రమాదం పట్ల రోగుల కుటుంబాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆస్పత్రి వెలుపల ధర్నా కూడా నిర్వహించారు. పాలనా యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని వారు విమర్శించారు.

**ముఖ్యమంత్రి విచారం.. ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు**

ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అర్థరాత్రి దాటిన తర్వాత ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. గాయపడిన వారికి తక్షణమే చికిత్స అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇది చాలా విషాదకరమైన, ఆందోళన కలిగించిన సంఘటన అని సిఎం అభివర్ణించారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జరిగిన ఘటనపై సవివరమైన నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. సంఘటన తీవ్రతను దృష్టిలో వుంచుకుని ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు జారీ చేశారు.

# మోగిన బీహార్ ఎన్నికల నగారా

(మొదటి తరువాయి)

వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది. బిహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్‌పై జ్ఞానేశ్ కుమార్ స్పందించారు ఎస్ఐఆర్ ముసాయిదాను ఆగస్టు ఒకటిన విడుదల చేశాం. దానిని అన్ని రాజకీయ పార్టీలకు అందజేశాం. అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేసే అవకాశం ఇచ్చాం. తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించాం. ఇప్పటికీ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం అని తెలిపారు. ఈ ఎన్నికలను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని జ్ఞానేశ్ చెప్పారు. 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. 7.43 కోట్ల మంది ఓటు వేయనున్నారని, వారిలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. రద్దీ నిర్వహణ కోసం ఒక్కో బూత్‌లో 1200 మంది ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వేసే పక్రియను ఈ ఎన్నికలతోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. రెండు దశల్లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. నవంబర్ 22లోపు ఎన్నికల పక్రియ పూర్తి చేస్తామని సీఈసీ చెప్పింది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, ఆగస్టు 1న ఓటర్ల తుది జాబితా ప్రకటించామని సీఈసీ సభ్యులు తెలిపారు. బిహార్‌లో మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్ల జాబితాలో సవరణలకు ఇంకా అవకాశం ఉందని కూడా సీఈసీ తెలిపింది. నామినేషన్లకు 10 రోజుల ముందు కూడా.. ఓటరు జాబితాలో మార్పులు చేసుకోవచ్చని సూచించింది. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈసారి ఎన్నికల పక్రియ మరింత సులభతరం చేస్తున్నామని సీఈసీ వెల్లడించింది. బిహార్ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందని సీఈసీ స్పష్టం చేసింది. బీహార్ మొదటి విడత ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 10న వస్తుంది. నామినేషన్ల దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబర్ 17. నామినేషన్ ఉపసంహరణ గడువు అక్టోబర్ 20తో ముగుస్తుంది. నవంబర్ 6 తేదీన మొదటి విడత ఎన్నికలు జరుగుతాయి. ఇక, రెండో విడత ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 13న విడుదల చేస్తారు. నామినేషన్ల దరఖాస్తుకు అక్టోబర్ 20 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 23 వరకూ అవకాశం ఉంటుంది. తుది దశ ఎన్నికల పోలింగ్ నవంబర్

11న జరుగుతుంది. నవంబర్14న కౌంటింగ్ చేపట్టి అదేరోజు ఎన్నికల ఫలితాలు విడుదల చేస్తారు. వృద్దులు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి దగ్గరే ఓటింగ్ అవకాశం కల్పిస్తున్నామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఎలాంటి ఫిర్యాదుకైనా 1950 నెంబర్‌కు ఫోన్ చేసే అవకాశం ఉంటుందని, సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరించింది. బిహార్ ఎన్నికల నుంచి కొత్తగా 17 సంస్కరణలు తీసుకొస్తున్నామని కూడా చెప్పింది. ఈ సంస్కరణలను భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా అమలుచేస్తామంది. బిహార్‌లో మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 14 లక్షల మంది కొత్త ఓటర్లని సీఈసీ చెప్పింది. ఇక నుంచి ఇ÷ఎంఓలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉంటాయని ఎన్నికల సంథం తెలిపింది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో జేడీయూ, భాజపా కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ, రెండేళ్లకే నీతీశ్ ఎన్డీయేను వీడి.. ఆర్జేడీ, కాంగ్రెస్‌తో మహాగఠ్‌బంధన్‌లో చేరి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ బంధమూ ఎంతోకాలం నిలవలేదు. 2024 జనవరిలో మహా కూటమిని వీడిన జేడీయూ మళ్లీ ఎన్డీయేతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మరోసారి నీతీశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

# రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు ..కటింగ్ మాస్టర్

(మొదటి తరువాయి)

రేవంత్.. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ నగరంకి నీళ్లు ఎలా తీసుకువెళ్తున్నాడని ప్రశ్నించారు. కేసీఆర్ చెమటోడ్చి కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం అని, మల్లన్నసాగర్ ప్రాజెక్టు సీఎం రేవంత్ నాన్న కట్టారని నీళ్లు తీసుకువెళ్తున్నారా? అని మండిపడ్డారు. తలకిందులుగా తప్పస్సు చేసినా ఇక సీఎం రేవంత్ మాటలను ఇక ప్రజలు నమ్మరు అని హరీష్ రావు అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు హరీష్ రావు సవాల్ విసిరారు. వడ్లకో నీతి, గోధుమలకో నీతా అని అడిగే దమ్ముందా? బీజేపీ ఎంపీలకు అని అడిగారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని.. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు, పూరా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీ బలంగా ఉంటే కేంద్రం మెడలు వంచి పనులు చేసుకోవచ్చు. ఏపీలో టీడీపీ ఇప్పుడు అదే చేస్తుంది. సీఎం రేవంత్ కేరళ, కర్ణాటక, ఢిల్లీ తిరగడానికి సరిపోతుంది. రాష్ట్రంలో ఆర్ఆర్ టాక్స్ నడుస్తుంది. పోలీసులు మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే పింక్ బుక్కులో రాసుకుంటాం. మా ప్రభుత్వం వచ్చాక ఆ పోలీసుల పని పడతాం. కేసీఆర్ వచ్చాకే మార్కెట్ కమిటీల్లో బీసీలకు అవకాశం ఇచ్చాం' అని హరీష్ రావు చెప్పారు. 'సంగారెడ్డి జిల్లాలో లక్షా 20 ఎకరాల సాగు కోసం సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు తెచ్చాడు కేసీఆర్. త్వరలో సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం. కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలి అని జనాలు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రామిసరి నోట్, బాండ్ పేపర్లకు విలువ లేకుండా చేసింది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వలేదు కానీ 2 లక్షల పింఛన్లు తీసేశారు. రెండు నెలల పించన్ ఎగ్గొట్టారు. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి గ్రామంలో పంచాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓటు అడగటానికి వస్తే హామీలపై నిలదీయండి. కల్యాణ లక్ష్మి పథకంలో 8 లక్షల తులాల బంగారం కాంగ్రెస్ పార్టీ బాకీ పడింది. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. రేవంత్ ఎన్నికల ముందు రజిని కాంత్ తర్వాత గజిని కాంత్ లా అయ్యాడు. ఫ్యూచర్ సిటీలో రోడ్లు, మూసి సుందరికరణ కోసం నిధులు ఉంటాయి. ప్రజలకు ఇచ్చే పథకాల కోసం మాత్రం నిధులు ఉండవు. కేసీఆర్ 33 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తే రేవంత్ 19 వేల కోట్ల రూపాయలే రుణమాఫీ చేశారు. రైతులకు యూరియా సరఫరా చేయలేని దద్దమ్మ, చేతగాని ప్రభుత్వం ఈ కాంగ్రెస్. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ గెలవడం పక్కా' అని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# సుప్రీం కోర్టు తీర్పు శుభపరిణామం

(మొదటి తరువాయి)

పోరాటాలు చేసి సాధిస్తాం.. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది.. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాం.. 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరితో ఉన్నాం.. ఈ రిజర్వేషన్ల కోసం జీవో కూడా విడుదల చేశాం.. మా నిర్ణయానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం అభిషేక్ మనుసింఘ్వి

వాదనలు గట్టిగా వినిపించారన్నారు. అంతకు ముందు మాట్లాడుతూ...బీసీ రిజర్వేషన్ల కల్పనకు సుప్రీంకోర్టు అంగీకరిస్తుందని తమకు నమ్మకం ఉందని చెప్పారు. ఇందిరా సహానీ కేసు తీర్పు ఆధారంగా తెలంగాణలో రిజర్వేషన్లు కల్పించవచ్చన్నారు. సిపెక్ సర్వే ద్వారా సమగ్రమైన జన గణన వివరాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నామని వెల్లడించారు. రిజర్వేషన్ల కల్పన కోసం హైకోర్టు, సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాగా.. బీసీ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టులో జరిగే వాదనలు సందర్భంగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి కోర్టుకు హాజరయ్యారు. సుప్రీం తీర్పును మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటికి ఇంటికి సర్వే నిర్వహించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సబ్ కమిటీ ద్వారా సమీక్షించి క్యాబినెట్ అనుమతి తీసుకొని దాన్ని అసెంబ్లీలో పెట్టి అన్ని రాజకీయాల పార్టీల ఏకగ్రీవ నిర్ణయంతో చట్టాన్ని గవర్నర్‌కు పంపించామని తెలిపారు. గవర్నర్ రాష్ట్రపతికి పంపించారన్నారు. అయితే దీనిపై కొంతమంది వ్యక్తులు కోర్టుకు వెళ్తున్నారని మండిపడ్డారు. రాష్ట హైకోర్టులో వాదనలు జరిగాయని.. ఎన్నికల నోటిఫికేషన్‌కు వెళ్లొచ్చని చెప్పారని మంత్రి వెల్లడించారు. హైకోర్టులో ఈకేసుపై 8వ తేదీ విచారణ జరగాల్సి ఉందని.. ఈ లోపే వారు సుప్రీంకోర్టుకు వచ్చారన్నారు. న్యాయబద్ధంగా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ వచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సుప్రీంలో కేసు ఉన్నందున ఈ క్రమంలో తెలంగాణ మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి నిన్న రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని పిటిషన్ వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరాదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని పిటిషన్ దాఖలైంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ముందు కేసు విచారణకు రాగా పిటిషన్‌ను ధర్మాసనం విచారించేందుకు తిరస్కరించింది. దీంతో మంత్రులు సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించారు.

# పరిశ్రమలు పెట్టే వారికి అన్నిరకాల మద్దతు

(మొదటి తరువాయి)

సీఎం అభినందించారు. ఫార్మా పాలసీని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని.. అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని వెల్లడించారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని.. ఫార్మాకు సంబంధించిన ప్రముఖులు ఆ యూనివర్సిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని సీఎం వివరించారు. తెలంగాణ మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలిలిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్షరింగ్ యూనిట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఈ యూనిట్ ఏర్పాటుకు ఒక బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.9000 కోట్లు భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. దీంతో ఎలిలిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. సోమవారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎలిలిల్లీ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎంతో పాటు ఐటీ అండ్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎలిలిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. చర్చల అనంతరం ఎలిలిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే మాన్యుఫాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎలిలిల్లీ కాంట్రాక్ మాన్యుఫాక్షరింగ్ నెట్వర్క్ సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎలిలిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది. ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎలిలిల్లీ కంపెనీ కార్యకలాపాలు ఉన్నాయి. హైదరాబాద్ లో ఈ ఏడాది ఆగస్ట్ నెలలోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్‌ను ప్రారంభించింది. విస్తరణలో భాగంగా ఎల్ లిల్లీ కంపెనీ బారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## 2025 అక్టోబర్ 7, మంగళవారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
ఆశ్వయుజ మాసం
శుక్ల పక్షం
తిథి
పౌర్ణమి: అక్టోబర్ 6 ఉదయం 11:38 అక్టోబర్ 7 ఉదయం 8:27 వరకు
కృష్ణ పక్ష ప్రథమా: అక్టోబర్ 7 ఉదయం 8:27 అక్టోబర్ 8 ఉదయం 5:39 వరకు
నక్షత్రం
ఉత్తరభాద్రపద: అక్టోబర్ 6 ఉదయం 6:28 అక్టోబర్ 7 ఉదయం 5:19 వరకు
రేవతి: అక్టోబర్ 7 ఉదయం 5:19 అక్టోబర్ 8 ఉదయం 4:34 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:35 - 5:22
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:41 - 12:28
అమృతకాలం: రాత్రి 10:12 - 11:43
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 3:00 - 4:29
యమగండం: ఉదయం 9:07 - 10:36
దుర్ముహూర్తం: ఉదయం 9:58 - 10:46, మధ్యాహ్నం 2:43 - 3:30
వర్జ్యం: ఉదయం 7:19 - 8:50

# రిజర్వేషన్ల మార్పు కోసం ఆర్డీవోను కలిసిన తర్నికల్ గ్రామ ప్రజలు



**కల్వకుర్తి, అక్టోబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామానికి చెందిన ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ గ్రామానికి అన్యాయం జరిగిందంటూ సోమవారం మండల రెవెన్యూ అధికారి (ఆర్డీవో)ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బీసీలకు, ఎస్సీలకు రిజర్వేషన్ల విషయంలో సమానత్వం లేకుండా వ్యవహరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2025లో వెలువడిన తాజా రిజర్వేషన్ల ప్రకారం, బీసీలు అధికంగా ఉన్న వార్డులకు ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వడం, ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు బీసీ రిజర్వేషన్ కేటాయించడం ద్వారా సామాజిక న్యాయాన్ని విస్మరించారని గ్రామస్తులు పేర్కొన్నారు. తర్నికల్ గ్రామపంచాయతీకి ఎస్సీ జనాభా అత్యధికంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ రాకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ విధంగా రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగితే బహుజన వర్గాలకు న్యాయం జరగదని, సామాజిక సమతుల్యతకు భంగం కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ప్రత్యేక దృష్టి సారించి, రిజర్వేషన్లను పునఃపరిశీలించి, ఎస్సీ మరియు బీసీ వర్గాలకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్ల సురేష్ గౌడ్, గోరటి శ్రీనివాసులు, వర్కాల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండా వద్ద చెత్త ప్రజల్లో ఆగ్రహం

**-మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు**

**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ తిలక్ రోడ్డులోని విశ్వకర్మ చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే స్థలంలో చెత్త వేయడం జరుగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుల, మత, వర్ణ, వర్గ భేదం లేకుండా ప్రజలు గౌరవించే జాతీయ జెండా వద్ద ఇష్టారాజ్యంగా చెత్త వేయడం దైవ సమానంగా భావించే స్థలానికి



అవమానంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం స్వతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ స్థలంలో వేడుకలు నిర్వహిస్తారు. అలాంటి ప్రదేశంలో చెత్త వేయడం వల్ల దుర్గంధం వ్యాపించి, రహదారి గుండా వెళ్లే వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ పరిస్థితిని పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. జాతీయ పతాక గద్దె చుట్టూ చెత్త వేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, షాపు యజమానులు, కాలనీవాసులకు పటిష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# గిన్నిస్ రికార్డు సృష్టించిన సోను కరాటే విద్యార్థులు




**ఆమన్‌గల్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమన్‌గల్ మండలంలోని సోను కరాటే విద్యా సంస్థ ఘన విజయాన్ని సాధించింది. ఈ సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ ప్రతిభ, క్రమశిక్షణ, కష్టపాటు ద్వారా గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించి భారతదేశానికి గౌరవం తీసుకువచ్చారు. ప్రపంచ కరాటే గురువుల సంఘం ఆధ్వర్యంలో, బాల మురుగన్ సమన్వయంతో చెన్నై నగరంలోని ఎస్.ఐ.వి.ఇ.టి. కళాశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ వేడుకకు గిన్నిస్ సంస్థ అధికార ప్రతినిధి రిషి నాథ్ ముఖ్య అతిథిగా హాజరై, సోను కరాటే విద్యా సంస్థ వ్యవస్థాపకుడు, సంచాలకుడు మాస్టర్ ఎస్. సోను గారికి గిన్నిస్ పతకం మరియు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ ఎ.కె.ఎస్. వినోద్ సర్వాగి (2025 -2026) మరియు ఇమిడియేట్ పూర్వ జిల్లా గవర్నర్ ఎన్.ఎస్. సరవణన్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. మాస్టర్ ఎస్. సోను గారి శిక్షణలో గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థులు కమాటాం శ్రీయాంష్, కోలిచిలిమి యశ్వంత్, కేశనమోని నిత్విక్ గౌడ్, మొహమ్మద్ యాస్మీన్, మొహమ్మద్ తదితరులు తమ ప్రతిభతో దేశానికి పేరు తెచ్చారు.

# ఘనంగా ముగిసిన వస్పుల శివకుమార్ స్మారక క్రికెట్ పోటీ



**ఆమనగల్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయ సమీపంలో వస్పుల శివకుమార్ స్మారకార్థంగా నిర్వహించిన క్రికెట్ పోటీ విజయవంతంగా ముగిసింది. గత ఐదు రోజులుగా ఉత్సాహభరితంగా సాగిన ఈ క్రీడా పోటీకి స్థానిక యువత పెద్ద ఎత్తున హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి మెడికల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. విజేత శివం జూనియర్స్ కు షీల్డ్‌తో పాటు రూ. 20,000 నగదు బహుమతి, రన్నర్ ఎంకే ఛాలెంజర్స్ కు షీల్డ్‌తో పాటు నగదు బహుమతి అందజేశారు. ఈ పోటీ నిర్వహణలో వస్పుల శివకుమార్ బాల్యమిత్రులు, స్పాన్సర్లు ప్రభుశంకర్, మొదటి బహుమతి దాతలు, షీల్డ్ దాత శ్రీకాంత్ వైఫై, టీమ్లకు మద్దతు అందించిన రాజు కొత్ర, చెన్నకేశవులు, మహేందర్, మహేష్, అప్సర్, రమేష్ టీ వరల్డ్, వస్పుల సురేష్, శివ సూర్య, అమనగల్ క్రికెట్ సంఘం ఆటగాళ్లు తదితరులు విశేషంగా పాల్గొన్నారు. ఈ పోటీ ద్వారా స్థానిక యువతలో క్రీడా స్ఫూర్తి పెరిగిందని, శివకుమార్ స్మృతిని గౌరవించే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు.

# వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**ఎలిగేడు, అక్టోబర్6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని లలితపల్లె, దూళికట్ట గ్రామాల్లో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పంటలు నేలకొరిగిన నేపథ్యంలో, మండల వ్యవసాయ అధికారి ఉమాపతి సోమవారం అక్కడి పొలాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన పొలాల్లో పంటలు పాడైపోయిన దృశ్యాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రైతులు తమ పొలాల్లో నిలిచిన నీటిని పూర్తిగా తొలగించి, లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపిన 5 శాతం ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారి చేయడం ద్వారా మొలకలు పాడవడం, రంగు మారడం వంటి సమస్యలను నివారించవచ్చు" అని సూచించారు. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా పంటలను కొంతవరకు రక్షించుకోవచ్చని ఆయన వివరించారు. ఈ పర్యటనలో ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారులు సురేష్, శరణ్య పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



**అడవిదేవులపల్లి, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆర్ఎస్ఎస్ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అడవిదేవులపల్లి గ్రామంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, కార్యకర్తలు, ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరై ఉత్సవాలను మరింత వైభవంగా మార్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా మిర్యాలగూడ గ్రామీణ ఖండ కార్యవాహ పాల్తీయ స్వామి గారు హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, "దేశం ఎదుర్కొన్న విపత్తుల సమయంలో ఆర్ఎస్ఎస్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలందించింది. జీతభత్యాలు లేకుండా, దేశ సేవ కోసం పనిచేసే సైనికులవలె కార్యకర్తలు తమ సేవలను అందిస్తున్నారు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప మండల కార్యవాహ కూరాకుల రవీంద్రనాథ్, అడప నాగేశ్వరరావు, రమేష్ దాస్, శివ, చింతల పరమేష్, పెద్దింటి కొండలు, బండి జానకిరామ్, రమేష్, శ్రీను తదితరులు పాల్గొని శతాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు.

# ఆరోగ్య కేంద్రాల్లో ఔషధ మొక్కల నాటకం తప్పనిసరి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశం**




**తిమ్మాపూర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నాటాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, వార్డు, ల్యాబ్, మెడికల్ స్టోర్, ప్రసూతి గది తదితర విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ మాతా శిశు సంరక్షణ కార్డును పరిశీలించి టీకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రతి ఆరోగ్య కేంద్రం శుభ్రంగా ఉండాలి. చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. అలాగే ఔషధ మొక్కలు నాటడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు సహాయపడుతుంది" అని పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణాపూర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఐదవ తరగతి విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠం చదివించి, రెండవ తరగతి విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చిన్నారులతో ముచ్చటించి, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "అన్ని పాఠశాలల్లో బుధవారం బోధన తప్పనిసరిగా అమలు చేయాలి. రీడింగ్ రూమ్ ఆకట్టుకుంటోంది. మరిన్ని పాఠశాలల్లో ఇదే తరహాలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో సురేందర్, ఎంఈఓ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ ప్రిసిల్లా పాల్గొన్నారు.

# హెచ్ఎండిఏ కార్యాలయం ఎదుట ధర్నాకు బయలుదేరిన చెన్నంపల్లి భూ బాధితులు

**అలైన్‌మెంట్ మార్పు కోసం పేద రైతుల పోరాటం**

**అమనగల్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమనగల్ మండలం చెన్నంపల్లి (మాలేపల్లి) గ్రామానికి చెందిన త్రిపుల్ ఆర్ భూ బాధితులు తమ భూములను



రక్షించాలనే లక్ష్యంతో, రోడ్ మార్గదర్శకాన్ని మార్చాలని డిమాండ్ చేస్తూ, హైదరాబాద్ నగరంలోని మెట్రో అభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట ధర్నాకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు వెంకటన్న, భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు దొడ్డి పరమేష్, బొడ్డుపల్లి లక్ష్మయ్య, మధ్యల రామస్వామి, తెలుగు మల్ల వెంకటస్వామి, పబ్బతి లక్ష్మయ్య, మధ్యల వెంకటయ్య, దొడ్డి చెన్నయ్య, చిట్టెమ్మ, తిరుమలమ్మ, రాములమ్మ, ముత్యాలు, ఎల్లమ్మ, పబ్బతి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. భూములపై జీవనం కొనసాగిస్తున్న పేద రైతులు మాట్లాడుతూ, "మా భూములు చిన్నచిన్న పొలాలు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న మా కుటుంబాలు అలైన్‌మెంట్ మార్పు వల్ల తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ప్రభుత్వాలు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పేద రైతుల భూములను బలిగొడుతున్నాయి. ఇది అన్యాయమని, పాత మార్గదర్శక ప్రకారమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు.

# హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులపై మండిపడ్డ శ్రీరాములు అందెల





### "హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే సహించం" - బిజెపి నేత

**సరూర్‌నగర్, అక్టోబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాపై చర్యలు తీసుకోవాలని గత కొంతకాలంగా పోరాటం చేస్తున్న బిజెపి మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్, జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు ఈరోజు హౌస్ అరెస్ట్‌కు గురయ్యారు. నిన్న సుల్తాన్‌పూర్ గ్రామంలో బొడ్రాయిపై ఒక వర్గం వారు కారు ఎక్కించడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ, ఈరోజు ధర్నా చేపట్టాలని



శ్రీరాములు పిలుపునివ్వడంతో, ఉదయం బాలాపూర్ సీఐ సుధాకర్, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి కలిసి ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, "మూడు నెలల క్రితం మదర్సా అక్రమ నిర్మాణంపై గ్రామంలో ధర్నా నిర్వహించాం. కానీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అధికార యంత్రాంగం ఒక వర్గం మెప్పుకోసం పనిచేస్తోంది. హిందువులకు అన్యాయం జరుగుతోంది. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే మౌనంగా ఉండం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ శుక్రవారం వరకు సమస్యను పరిష్కరించకపోతే, హిందూ సంఘాలతో కలిసి మదర్సాను ముట్టడిస్తాం. ఇది హిందువుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి" అని ఆయన హెచ్చరించారు.

# డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపిన మాజీ మేయర్ సునీల్ రావు



**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ నగరంలోని భగత్ నగర్ ప్రాంతంలో పెద్దమ్మ తల్లి దేవాలయం సమీపంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యతో స్థానిక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ప్రజల సమస్యను గమనించిన సునీల్ రావు మున్సిపల్ అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకునేలా సూచనలు ఇచ్చారు. అధికారుల సమక్షంలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపిస్తూ పనులను పర్యవేక్షించారు. ప్రజల సమస్యలపై స్పందనతో, పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# ఓటు చోరీపై కదం తొక్కిన తెలంగాణ కాంగ్రెస్

### ఊరూరా సంతకాల సేకరణ యుద్ధం ప్రారంభం

**మహేశ్వరం, అక్టోబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో ఓటు చోరీపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉద్యమబాట పట్టింది. తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఏఐసీసీ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు, రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచనలతో, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) నేతృత్వంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి



పాల్గొని మాట్లాడుతూ, "ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాలి. అర్హుల ఓట్లను తొలగించడం, అనర్హుల ఓట్లను చేర్చడం వంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే, ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితాను బహిరంగపరచాలి" అని డిమాండ్ చేశారు. బీజేపీ చేస్తున్న అక్రమ ఓటు చోరీపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ యుద్ధం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ప్రజల నుంచి సంతకాలు సేకరించి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకులు, యువ కాంగ్రెస్ కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జాగృతిలో బీసీ నాయకుల చేరికలు

### సమస్యలేని సామాజిక తెలంగాణ సాధన కవిత లక్ష్యం



**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్**
కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ జాగృతిలో బీసీ కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున చేరిక పొందారు. ఈ సందర్భంగా శ్రీరాముల రమేష్, గర్షకుర్తి విద్యాసాగర్, కోత్వాల అంజనేయులు తదితరులు జాగృతిలో చేరగా, వారికి జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కండువ కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, "కవిత నాయకత్వంలో తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లాలో బలోపేతం అవుతోంది. మన సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వాన్ని కాపాడేందుకు జాగృతి నిరంతరం కృషి చేస్తోంది. తెలంగాణ ప్రజలకు సేవ చేయడం లక్ష్యంగా జాగృతి స్థాపించబడింది. ఇప్పుడు జాగృతి మరియు అనుబంధ సంఘాలను మరింత బలంగా తీర్చిదిద్దే దిశగా పని చేస్తున్నాం" అని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ తప్పనిసరి అని, కోర్టు బిల్లు కొట్టివేస్తే ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధంగా ఉందని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్ విషయంలో మోసం చేస్తే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు కవిత నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, సమస్యలేని సామాజిక తెలంగాణ సాధించడమే కవిత లక్ష్యమని హరిప్రసాద్ అభిప్రాయపడ్డారు.

# ఇల్లందకుంట మండలంలో బీజేపీ జెండా ఎగరేస్తాం

### స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో బలమైన సంకల్పం

**ఇల్లందకుంట, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇల్లందకుంట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించబడింది. మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి జడ్పీటీసీ ప్రభారీ ఆకుల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బైరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ, "వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అహర్నిశలు కృషి చేయాలి. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలి" అని పిలుపునిచ్చారు.



మండల ప్రజలు ఇప్పటికే బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, మరింత శ్రమించి అధిక స్థానాలను కైవసం చేసుకోవాలని సూచించారు. అత్యధిక స్థానాల్లో విజయం సాధించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు విజయ కానుకగా అందించాలన్న సంకల్పాన్ని వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త తన వంతు పాత్ర పోషించాలని, గ్రామ స్థాయిలో బీజేపీ పాదముద్ర మరింత బలపడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప్పుల రమేష్, కంకణాల రవీందర్ రెడ్డి, నల్ల లింగారెడ్డి, కొత్త శ్రీనివాస్, కంకణాల సురేందర్ రెడ్డి, అబ్బిడి తిరుపతి రెడ్డి, ఇంగ్లే ప్రభాకర్, అంతం ఎల్లారెడ్డి, మట్ట పవన్, తాళ్ల పాపిరెడ్డి, ఉప్పు దుర్గయ్య, జంగం సమ్మయ్య, జోడు సంపత్, బండి రమేష్, ఇంగ్లే రమేష్, పలకల కిషన్ రెడ్డి, గురుకుంట్ల సంజీవ్, జలపతి, శ్రీధర్, చదువు సాయిరెడ్డి, గొర్రె ఓదెలు, తిప్పరబోయిన సమ్మయ్య, శ్రీరాముల రమేష్, మద్దూరి మల్లేష్, ఏనుగు సురేందర్ రెడ్డి, రాజా అంఖుషవాలి, మొత్కూరి మహేష్, రవీందర్, రాయమల్లు, స్వామి దాస్, మాదాసు మొగిలి, శానబోయిన శ్రీనివాస్, రామ్ శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల పథసంచలన్

### వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా దేశభక్తి సందేశం




**వేములవాడ, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వేములవాడ పట్టణంలో ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల సందర్భంగా స్వయం సేవకులు పథసంచలన్ నిర్వహించారు. స్థానిక పద్మశాలి సంఘ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరినగర్ మండల ఏక్ ప్రభారి జక్కుల సత్యనారాయణ మూర్తి ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "1925లో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ దేశవ్యాప్తంగా విస్తరించి, దేశభక్తి, హిందుత్వం ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. హిందుత్వం జీవన విధానమే కాక, విశ్వశాంతికి, మతాల సమన్వయానికి సనాతన విలువలతో కూడిన మార్గదర్శకంగా నిలుస్తోంది" అని వివరించారు. దేశాభివృద్ధికి హిందువులు పంచ పరివర్తన ‹ సామాజిక సమరసత, కుటుంబ జీవన విలువలు, స్వఆధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు › కోసం పాటుపడాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ పథసంచలన్‌లో వేములవాడ పట్టణంతో పాటు పరిసర గ్రామాల స్వయం సేవకులు, వివిధ సంఘ క్షేత్రాల కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశభక్తి, సామాజిక సమరసతకు ప్రాధాన్యతనిచ్చే ఈ కార్యక్రమం స్థానికంగా విశేష స్పందనను పొందింది.


# హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి సమీక్ష

### వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్లు

**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విజన్ 2047లో భాగంగా నాగపూర్ -హైదరాబాద్ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి సంబంధించి డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారీపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాన్ని తెలంగాణ రవాణా మరియు రోడ్డు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ నేతృత్వంలో నిర్వహించారు.



మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లాలో గంగాధర, రామడుగు, కొత్తపల్లి మండలాల



మీదుగా కారిడార్ వెళ్తుండటంతో, భూ సేకరణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో మహేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పాత బ్యాటరీ పేలడంతో సెల్ పాయింట్‌లో అగ్ని ప్రమాదం

జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద అప్రమత్తతతో మంటల అదుపు



**జగిత్యాల, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల ఓ సెల్ పాయింట్‌లో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో దుకాణంలో ఉన్న పాత బ్యాటరీ ఒక్కసారిగా పేలడంతో మంటలు వ్యాపించాయి.స్థానికులు వెంటనే సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ, దుకాణంలో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఫైర్ ఆఫీసర్ కృష్ణ కాంత్ తెలిపిన వివరాల ప్రకారం, పాత బ్యాటరీ పేలడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు గుర్తించారు. ఈ ఘటనలో సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని దుకాణ యజమాని శ్రావణ్ పేర్కొన్నారు. ప్రమాద సమయంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగించినప్పటికీ, ఆస్తినష్టం తీవ్రంగా ఉండటంతో వ్యాపారవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం


జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి, అక్టోబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశంలో బీజేపీ పార్టీ పెద్ద ఎత్తున ఓటు చోరీ చేసి మళ్లీ అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గోపాల్‌పేట మండలం జయన్న తిరుమలాపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ పెద్ద ఎత్తున ఓటు చోరీ చేసిందని, ఆ ఆధారాలను రాహుల్ గాంధీ ప్రజల ముందు ఉంచారని తెలిపారు.
ఎన్నికల సంఘం కానీ బీజేపీ కానీ ఆ వాస్తవాలను ఖండించలేకపోయాయని పేర్కొన్నారు. తెలంగాణలో 2018 ఎన్నికల్లో ఈవీఎం ట్యాంపరింగ్ జరిగిందని, దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉన్నా ఒకే సీటు గెలవడం దీనికి నిదర్శనమని చెప్పారు ప్రజాస్వామ్యంలో ఓటు దొంగలించడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, నాయకులు చీర్ల జనార్ధన్, రోహిత్, రాగి అక్షయ్, ఎత్తం చరణ్ రాజ్, జోగు శాంతన్న, హరిబాబురెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి చీరను బహుమతిగా అందజేసిన శ్రీనివాస్ గౌడ్

నవరాత్రుల సందర్భంగా జలపల్లిలో విశేష ఘట్టం



**బాలాపూర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బాలాపూర్ మండలం జలపల్లి గ్రామంలోని వీకర్ సెక్షన్ కాలనీలో నవరాత్రుల సందర్భంగా జై దుర్గా దేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి చీర వేలం పాటలో మాజీ ఎంపీటీసీ దూడల శ్రీనివాస్ గౌడ్ చీరను కైవసం చేసుకున్నారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఆ చీరను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "ఏ ప్రభుత్వం వచ్చినా ఆమె మంత్రి పదవిలో కొనసాగాలని అమ్మవారిని కోరుకున్నాను. మునుపటిలాగే మంత్రిగా చూడాలన్న నా ఆకాంక్షను అమ్మవారి దయతో నెరవేర్చాలని కోరుతూ ఈ చీరను బహుమతిగా అందజేశాను" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి భాస్కర్ గౌడ్ సహా పలువురు స్థానిక నాయకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. నవరాత్రుల సందర్భంగా జరిగిన ఈ విశేష ఘట్టం గ్రామస్థుల మధ్య విశేష చర్చకు దారితీసింది.

# జగిత్యాల నియోజకవర్గంలో బీజేపీ సన్నాహక సమావేశం

## గడపగడపకు అభివృద్ధిని తీసుకెళ్లే లక్ష్యంతో కార్యకర్తలకు దిశానిర్దేశం



**జగిత్యాల, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జగిత్యాల పట్టణంలోని స్థానిక టౌన్ హాల్లో బీజేపీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం విస్తృతంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు అధ్యక్షత వహించారు. నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి బాబు మాట్లాడుతూ, "వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేయాలి. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అరవింద్ చేసిన అభివృద్ధిని గడపగడపకు తీసుకెళ్తూ, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగాలి" అని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర నాయకురాలు బోగ శ్రావణి, జిల్లా ప్రధాన కార్యదర్శులు వడ్డేపల్లి శ్రీనివాస్, నలువాల తిరుపతి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పన్నల తిరుపతి రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు పాల్గొన్నారు. అలాగే రాయికల్, బీర్పూర్, సారంగాపూర్, తుంగూరు గ్రామాల మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు సమావేశాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. బీజేపీ బలోపేతానికి, స్థానిక స్థాయిలో ప్రజల మన్ననలు పొందేందుకు ఈ సమావేశం దిశానిర్దేశకంగా నిలిచిందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# గ్రంధాలయాలు దేవాలయాలతో సమానం

-వి.రజని




**వనపర్తి,అక్టోబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
గ్రంధాలయాలు దేవాలయాలతో సమానం అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ వి రజని అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రం లోని జిల్లా గ్రంథాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పుస్తక పాఠకులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో కార్యదర్శి మాట్లాడుతూ పిల్లలు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కనీస అవసరాలను తీర్చకపోయిన వారికి గృహంలో స్థానం కల్పించకపోయినా "తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ మరియు సంరక్షణ చట్టం, 2007" ప్రకారం రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ కు తమ పిల్లలనుండి నెలకు సరిపడు డబ్బులు ఇప్పించాలని మెయింటెనెన్స్ కంప్లైంట్ ఇవ్వవచ్చు అని తెలియజేశారు. అత్యధికంగా పదివేల రూపాయల వరకు మెయింటెనెన్స్ అమౌంట్ కోరవచ్చని తెలిపారు. ఎవరైనా తల్లిదండ్రులను నిరాశ్రయులను చేస్తే 14567 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి కంప్లైంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా బాల్యవివాహాల నిషేధ చట్టం మరియు మోటార్ వాహనాల చట్టం గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పనితీరు గురించి మరియు ఏ విధముగా సంస్థ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు , విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తుందో తెలియజేశారు న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏం రఘు, గ్రంథాలయ కార్యదర్శి వెంకటయ్య, గ్రంథాలయ ఇంచార్జ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

# టిక్లీ అకాల మరణంతో దిగ్భ్రాంతికి లోనైన సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండల కేంద్రంలో ఉన్న కేసీ తండా గ్రామంలో విషాదం నెలకొంది. మాజీ ఎంపీటీసీ జాటోత్ బద్రు నాయక్ చెల్లెలు రాత్లవత్ టిక్లీ అకాల మరణం చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది.ఈ ఘటన తెలుసుకున్న మహేశ్వరం నియోజకవర్గ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హుటాహుటిన కేసీ తండా గ్రామానికి చేరుకొని టిక్లీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అంతిమయాత్రలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టిక్లీ మృతికి పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబానికి మద్దతుగా నిలిచారు.

# వృద్ధుల దినోత్సవం సందర్భంగా పుణ్య దంపతులకు సత్కారం

గీత భక్త సమాజం ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం



**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో ప్రపంచ వృద్ధుల దినోత్సవం 2025 సందర్భంగా గీత భక్త సమాజం ఆధ్వర్యంలో వయో శ్రేష్ఠ పుణ్య దంపతులు జిల్లా వీరేశం (94), ధర్మపత్ని శ్రీమతి కౌమసల్య (93) దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బండ సత్తయ్య, కార్యదర్శి ఉప్పల రామేశం పాల్గొన్నారు.

# హెచ్‌ఎండిఏ కార్యాలయానికి తరలిన భూ నిర్వాసితులు

-"త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం కొనసాగుతుంది"
-సీపీఎం శ్రీను నాయక్



**షాద్‌నగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
త్రిపుల్ ఆర్ రోడ్ అలైన్‌మెంట్ మార్పును డిమాండ్ చేస్తూ, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన భూ నిర్వాసితులు ఈరోజు హైదరాబాద్ హెచ్‌ఎండిఏ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో కేశంపేట్, ఫరూక్‌నగర్, కొందుర్గు మండలాలకు చెందిన పలు గ్రామాల రైతు కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీఎం పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీను నాయక్ మాట్లాడుతూ, "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్రిపుల్ ఆర్ రూట్ మ్యాప్‌ను సర్వే నెంబర్లతో ప్రకటించడం వల్ల పేద రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కొక్కరికి రెండు, మూడు ఎకరాల భూములు మాత్రమే ఉన్న రైతులు తమ భూములపై వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అలైన్‌మెంట్ మార్పు వల్ల వారి జీవనాధారం కోల్పోతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. అలైన్‌మెంట్ ప్రకటన ప్రాంతాలన్నీ పేద రైతుల భూములే కావడం, ఇది పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం జరుగుతోందని ఆరోపించారు. "పేద రైతుల పొట్ట కొట్టే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించకూడదు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మాణం చేపట్టాలి. లేనిచో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు" అని శ్రీను నాయక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్, రమేష్, బోజియా హరీష్, నరేష్, సుదర్శన్ రెడ్డి, యాదయ్య, భీమయ్య, మల్లయ్య, సత్తయ్య, యాదమ్మ, విజయ, అనంతమ్మ, మణెమ్మ, లక్ష్మమ్మ, కుమార్, శోభ, మంజుల, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ ఎమ్మార్వో కార్యాలయంలో సందడి

ప్రజల అవసరాలపై తక్షణ స్పందన



**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ అర్బన్ ఎమ్మార్వో కార్యాలయంలో సోమవారం ప్రజల రద్దీ కనిపించింది. కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధృవపత్రాలు, స్టేట్‌సెంట్రల్ ఈడబ్ల్యూఎస్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన ప్రజల అప్లికేషన్లు స్వీకరించిన అధికారులు, తక్షణమే పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, వారి పక్షాన స్పందిస్తున్న అధికారుల తీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి.
- స్థానిక సంస్థల ఎన్నికలలో 100 శాతం గెలుపు మనదే.
- ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ,అక్టోబర్ 06. (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేవరకొండపట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వ్యవసాయ మార్కెట్ యార్డులో పిఏ పల్లి, గుడిపల్లి, చింతపల్లి, కొండమల్లేపల్లి మండలాల ముఖ్య నాయకులతో కలిసి, ఎమ్మెల్యే బాలు నాయక్, ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛాయుత వాతావరణం ఎక్కువగా ఉంటుందని, అందుకే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికి బలంగా ఉందని అన్నారు. నియోజకవర్గంలో దాదాపు 324 మంది ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కాబోతున్నారని మనందరం కలిసి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అన్నింటిని పరిగణలోకి తీసుకొని అభ్యర్థుల ఎంపిక ఉంటుందని గెలిచే అభ్యర్థులకే అవకాశాలు వస్తాయని సూచించారు. గ్రామంలో సర్పంచ్, ఎంపిటిసిలను గెలిపించిన వారే నాయకులని,రాబోయే రోజుల్లో వారికే పదవులు లభిస్తాయని స్పష్టం చేశారు. అభ్యర్థులను ఎంపిక చేసేది మీరే గెలిపించేది కూడా మీరేనని వెల్లడించారు. 100శాతం ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలు గెలుస్తామని, 95శాతం సర్పంచ్ స్థానాలను మనమే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మనందరి ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి, ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమేనని స్పష్టం చేశారు. బీజేపీ పార్టీకి తెలంగాణ పైన, బిసిలపైన ప్రేమ లేదని అన్నారు. బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే ఉలుకు పలుకు లేదని తెలిపారు.బిజెపికి కులాల మధ్య చిచ్చు పెట్టడం,మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం మాత్రమే తెలుసు అని విమర్శించారు.కేసీఆర్, కేటీఆర్ ల అవినీతి బాగోతాలు బయటపెట్టే సమయం ఆసన్నమైందని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం మొత్తం కేసుల పాలైందని అన్నారు. నియోజకవర్గంలో మనందరి లక్ష్యం కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఒక్కటే నని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు గత 10ఏళ్లుగా కడుపు కట్టుకొని పని చేశారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మిమ్ములను గెలిపించే బాధ్యత మాదేనని తెలిపారు. స్థానిక సంస్థల్లో గెలిచే అభ్యర్థులను ఎంపిక చేసి ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మండలాల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ


ఎన్నికల సన్నాహాల్లో అభ్యర్థుల ఎంపికపై దిశానిర్దేశం




**వంగూరు, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అచ్చంపేట పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “రాబోయే స్థానిక సంస్థల ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రతి గ్రామంలో అభ్యర్థుల ఎంపికను కార్యకర్తలే నిర్ణయించి, తమ గ్రామానికి తగినవారి పేర్లను తెలియజేయాలి. పార్టీ కోసం నిజంగా కృషి చేసినవారికి టికెట్ ఇవ్వడమే మా లక్ష్యం” అని స్పష్టం చేశారు.కొంతమంది నాయకులు కాంగ్రెస్ పార్టీకి విశిష్ట సేవలు అందించినవారికి టికెట్ ఇవ్వాలని అభిప్రాయపడగా, అందరి సూచనలను పరిగణనలోకి తీసుకుని ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిటీ సూచనల ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. వంగూరు మండలం అభివృద్ధి పథంలో ముందున్న మండలంగా గుర్తింపు పొందిన నేపథ్యంలో, పార్టీకి సేవలందించినవారికి ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించబడింది.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లేపల్లి జగన్, వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాదమోని రమేష్, అచ్చంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు క్యామ మల్లయ్య, వివిధ గ్రామ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష







-నియమావళి పాటిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలి
- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది తమ విధులను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ శ్రీ సి. నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించబడింది. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు, ఎంపీడీవోలు, ఎన్నికల నోడల్ అధికారులు, అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ ప్రక్రియ మొదలుకొని ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో అప్రమత్తత అవసరమని, ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల పరిశీలన, తుది అభ్యర్థుల జాబితా వంటి అంశాల్లో పొరపాట్లకు తావు లేకుండా వ్యవస్థను నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ, నియమిత అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. మండల స్థాయి ఎన్నికల సిబ్బంది ఒక టీంగా ఏర్పడి సమగ్రంగా పనిచేయాలని సూచించిన కలెక్టర్, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సభలు, ర్యాలీలకు ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, ఖర్చుల పర్యవేక్షణ బృందానికి సమాచారం అందించకపోతే నిబంధనల ప్రకారం ఖర్చుల పరిశీలన జరుగుతుందని తెలిపారు. సరైన అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని, ఆ దిశగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీం, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీంలలో పోలీసు సిబ్బంది తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి చర్య చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు శిక్షణ పూర్తయిందని, స్ట్రాంగ్ రూమ్, బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్ వంటి అంశాల్లో అప్రమత్తత అవసరమని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక అధికారులను నియమించామని, ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రవర్తన నియమావళిని అమలు చేయాలని సూచించారు. పోలీసు శాఖ అన్ని విభాగాలతో సమన్వయంగా పనిచేస్తూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుందని డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. అదనపు డీసీపీలు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగిన బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, సైబరాబాద్ పోలీస్ శాఖ అదనపు డీసీపీలు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, అబ్కారి శాఖ సుపరింటెండెంట్ కృష్ణప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలు తక్షణమే జాబ్ కార్డులకు ఈ-కేవైసీ చేయించుకోవాలి

-అమ్రాబాద్ మండలంలో 15వ తేదీ వరకు 100 శాతం పూర్తి చేయాలని సూచన



The Mahatma Gandhi National Rural Employment Guarantee Act
Govt. ... Ministry of Rural Devel... Department of Rural Devel... 06-Oct-2025 01:17...
Back
R1.2.9 e-KYC Status Report: FY: 2025-2026
State : TELANGANA District : Nagarkurnool Block : AMRABAD

| S No. | Panchayats | Active Worker | KYC Done For Active Worker |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 1 | DOMALAPENTA | 85 | 0 |
| 2 | LAKSHMAPUR | 286 | 0 |
| 3 | MACHARAM | 434 | 0 |
| 4 | THIRUMALA PUR | 737 | 0 |
| 5 | VANGURONIPALLE | 398 | 0 |
| 6 | LAKSHMAPUR TANDA | 295 | 1 |
| 7 | UPPUNUNTHALA | 312 | 30 |
| 8 | MADAVARI PALLE | 783 | 31 |
| 9 | KOTAPALLI | 578 | 46 |
| 10 | PRASHANTH COLONY | 209 | 46 |
| 11 | AMARABAD | 1545 | 70 |
| 12 | TURKAPALLI | 297 | 133 |
| 13 | SALAPALLI | 330 | 135 |
| 14 | KUMARONI PALLI | 899 | 139 |
| 15 | VENKATESWARLA BAVI | 539 | 190 |
| 16 | TELUGUPALLE | 339 | 205 |
| 17 | KALMULONIPALLE | 415 | 228 |
| 18 | JANGAMREDDIPALLE | 832 | 295 |
| 19 | MANNANUR | 1229 | 347 |
| 20 | VATAWARLAPALLI | 631 | 347 |
| | Total | 11173 | 2243 |

Download In Excel Print Report last Updated on:05/10/2025



**అమ్రాబాద్, అక్టోబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు తమ జాబ్ కార్డులకు నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టం ప్రకారం తక్షణమే ఈ-కేవైసీ చేయించుకోవాలని ఈజీఎస్ మండల ఏపీఓ రఘుమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మండలవ్యాప్తంగా 11,1173 మంది కూలీలు ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగి ఉన్నారని, ఇందులో ఇప్పటివరకు 2,243 మంది మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారని వారు తెలిపారు. మిగిలిన కూలీలు తమ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సహాయంతో ఈ నెల 15వ తేదీ వరకు తప్పనిసరిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా ఉపాధి హామీ పనులకు అర్హత కొనసాగుతుందని, ప్రభుత్వ పథకాల లబ్ధి నిరంతరాయంగా అందుతుందని అధికారులు స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గులాబీ పార్టీకి ప్రజల మద్దతు

-కాంగ్రెస్ బాకీ కార్డులతో ఇంటింటా ప్రచారం



**కమాన్ పూర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు కమాన్ పూర్ మండలంలోని గొల్లపల్లి, పెరపల్లి, రొంపికుంట, నాగారం గ్రామాల్లో బిఆర్ఎస్ నాయకులు “కాంగ్రెస్ బాకీ కార్డులు”ను గడపగడపకు పంపిణీ చేశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నించాలన్నది ఈ ప్రచార ఉద్దేశం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, కేసీఆర్ గారే మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దాత్‌పల్లి ఆలయ ప్రారంభోత్సవంలో బూర నర్సయ్య గౌడ్

ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆలయం కేంద్రబిందువుగా నిలవాలి




**మంచాల, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** దాత్‌పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఈశ్వర రామాంజనేయ స్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు. గ్రామ బీజేపీ నాయకులు మల్లేష్ గుప్త, ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానంపై ఆయన స్వామివారి దర్శనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధికి, గ్రామ అభ్యున్నతికి ఈ ఆలయం కేంద్రబిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంచాల మండల అధ్యక్షులు నూకంరాజ్ ముదిరాజు, రాష్ట్ర నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వింజమూరు వెంకటరెడ్డి, జిల్లా నాయకులు నారెడ్డి నర్సింహ్మా రెడ్డి, శ్రీశైలం, పాండాల జంగయ్య, చీరాల పాండు, హరీష్, మండల ప్రధాన కార్యదర్శులు వెదిరే జగదీశ్వర్ రెడ్డి, కారింగు రాజు గౌడ్, తుర్క యంజాల్ అధ్యక్షుడు నర్సింహ్మా రెడ్డి, రాం రెడ్డి, యాట రమేష్, వెంకట రెడ్డి, రాజేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్, బండి రాజు గౌడ్, యాదగిరి రెడ్డి, సురేష్, పూర్ణచంద్, లడ్డు, అనీల్, బాలరాజ్, వెంకటేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉల్లంపల్లి గ్రామస్తులకు కోతల -కుక్కల బెడద

చిగురుమాడు, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్): చిగురుమాడు మండలం ఉల్లంపల్లి గ్రామంలో కోతులు, వీధి కుక్కల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయటకు వెళ్లాలంటే ఎక్కడ ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# బీఆర్ఎస్ పాలనలో మోసాలే మిగిలాయి

## డోకా కార్డు విడుదల చేసిన ఎమ్మెల్యే గండ్ర



**భూపాలపల్లి, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన మోసాలను వివరించారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి, రైతులను భయపెట్టి, ఉద్యోగుల జీతాలు నిలిపివేసి, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. రైతుబంధు పేరుతో ప్రజా సొమ్మును రియల్ ఎస్టేట్ వెంచర్లకు పంచిపెట్టడం, అమరవీరుల కుటుంబాలను నిర్లక్ష్యం చేయడం, సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా అభివృద్ధి పనులను అడ్డుకోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. మహిళలకు వడ్డీకే రుణం, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డీఎస్సీ నోటిఫికేషన్ అన్నీ వాగ్దానాలే తప్ప అమలు కాలేదని అన్నారు. గ్రూప్–1 పేపర్ లీక్, రేషన్ కార్డుల పంపిణీ లోపాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల హామీలు, ధరణి వ్యవస్థ ద్వారా భూముల అక్రమ స్వాధీనంప్రజలను మోసం చేసిన చర్యలుగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు "కాంగ్రెస్ బాకీ కార్డు" అంటూ గ్రామాల్లో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు అని గండ్ర విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణం

## ధ్వజస్తంభ పునర్నిర్మాణ మహోత్సవం విజయవంతం



**అబ్దుల్లాపూర్ మెట్టు, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలోని లష్కర్ గూడ గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునర్నిర్మాణ మహోత్సవం, అనంతరం శివ–పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు ప్రతి ఇంటి నుండి కిలో బియ్యం, బట్టలతో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారికి సేవలందించారు. మూడోరోజు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని లష్కర్ గూడ వాస్తవుడు సిద్ధగోని రంగయ్య గౌడ్ కుమారుడు సిద్ధగోని సతీష్ గౌడ్, స్వాతి దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో సహకరించిన దాతలను, శిల్పి రామకృష్ణ పంతులను శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందించారు. యువతీ, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

# పరిశుభ్రత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం



**హుస్నాబాద్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని 2వ వార్డులో తెలంగాణ సాంస్కృతిక సారథి హుస్నాబాద్ టీం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీం లీడర్ మొగిలి పాక స్నేహ నేతృత్వంలో బడి బాట, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, ఓటు హక్కు వినియోగం, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత వంటి అంశాలపై ప్రజలకు వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు పాతపల్లి సౌమ్య, ఠాకూర్ మనోహర్ సింఘ్, కందుకూరి శంకర్ బాబు, ఎలగందుల భాస్కర్, తీగుల్ల అరుణతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# "ప్రజలకు బాకీ ఉన్నమాట వాస్తవమే"

## బీఆర్ఎస్ డోకా కార్డ్‌కు కాంగ్రెస్ ప్రతిస్పందన



**వరంగల్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల భారం మోపినదిగా విమర్శిస్తూ, "బాకీ కార్డ్" ప్రచారం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. హనుమకొండలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "బీఆర్ఎస్ కా డోకా కార్డ్"ను విడుదల చేసిన నేతలు, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిన తీరును ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రైతు బంధు, నిరుద్యోగ భృతి, విద్యా రంగం, రిక్రూట్‌మెంట్, స్మార్ట్ సిటీ వంటి హామీలు నెరవేర్చకుండా మధ్యలో వదిలేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు నిధులు విడుదల చేయడం, రైతులకు పంటల బీమా పునరుద్ధరణ, ఎరువుల సరఫరా, మార్కెట్‌లో కనీస మద్దతు ధర అమలు, విద్యా రంగానికి జీవం పోసే చర్యలు చేపట్టినదిగా నేతలు వివరించారు. "మేము ప్రజలకు బాకీ ఉన్నమాట వాస్తవమే. విశ్వాసంతో మమ్మల్ని గెలిపించిన ప్రజలకు అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించడమే మా లక్ష్యం" అని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, కిసాన్ సెల్, మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లైన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు ప్రథమ స్థానం


**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ విద్యానగర్‌లో లైన్స్ క్లబ్ ఆఫ్ రాజరాజేశ్వరి సర్వసభ్య సమావేశం సోమవారం క్లబ్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. సెప్టెంబర్ మాసంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను కార్యదర్శి బండ కిషన్ రెడ్డి వివరించగా, గత మూడు నెలల ఖర్చుల వివరాలను కోశాధికారి ఠాగూర్ వందన సింగ్ సమర్పించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రీజనల్ చైర్మన్ కొల్లూరి జితేందర్ మాట్లాడుతూ, ఈ రీజన్లో రాజరాజేశ్వరి క్లబ్ ఫ్యామిలీ క్లబ్‌గా సేవా కార్యక్రమాల్లో ప్రథమ స్థానంలో ఉందని ప్రశంసించారు. ప్రతి క్లబ్ సభ్యుడు బుధవారం రోజు సేవా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అక్టోబర్ మాసంలో చేపట్టే కార్యక్రమాలపై సభ్యుల సలహాలు, సూచనలతో కార్యాచరణ రూపొందించబడింది. ప్రపంచ ఉపాధ్యాయ




దినోత్సవం సందర్భంగా క్లబ్ సభ్యులైన ఉపాధ్యాయులు వేల్పుల శశికళ, కే తిరుపతి, సిహెచ్ నాగేశ్వరరావు, వీ మహిపాల్ రెడ్డిలను క్లబ్ సన్మానించింది. ఈ సమావేశంలో రాళ్లపైన శశికళ, శంకర్ ప్రసాద్ రెడ్డి, వి బాల్ కిషన్ రావు, ముప్పిడి రాజశేఖర్ రెడ్డి, చాడ విమలమల్లారెడ్డి, కర్ర భాగ్యలక్ష్మి, విద్యాసాగర్ రెడ్డి, కనగర్తి శ్రీనివాస్, బండ గోపాల్ రెడ్డి, గుండోని రామచంద్రం, లంబు రాజు రెడ్డి, సంధి మోహన్ రెడ్డి, బొంగోని భాగ్య పరుశరాములు, జోడి బాల్ రెడ్డి, కుమారస్వామి, పి. సంగీతా, నారాయణరెడ్డి, ఏ. సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ పట్టా అందుకున్న కొర్ర కిషన్ నాయక్

## -డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ యుఎస్ఏ.


Govt Reg No 42/22
Govt. Niti Aayog & MSME
God Son Holy Spirit Theological Academy
Affiliated with Dayspring Theological University, Texas, USA
Affiliated with Good News International University, Newyork, USA/India
Accredited with Day Spring Christian University, USA/India
(ISO 9001:2015) An ISO Certified
DAYSPRING

Date : 16-09-2025

MEMORANDUM
To : Mr/Ms/Mrs. Dr. KORRA KISHAN
Proposed Doctorate : HONORARY DOCTORATE IN SOCIAL SERVICE
Ref : MAR/2025/Univ/Con/Confer
Letter Subject : Conferring Letter-Doctor of Honours
Date : 06-10-2025

Conferring Doctor of Honours

We are pleased to inform you that in receipt of your application and profile has been approved by the management of GOD SON HOLY SPIRIT THEOLOGICAL ACADEMY, Affiliated with Dayspring Theological University, Texas, USA after scrutinizing your profile and application, we have decided to felicitate you with HONOURARY DOCTORATE in the category of HONORARY DOCTORATE IN SOCIAL SERVICE on the occasion of University's Convocation which will be held on October - 6th - 2025 at Hyderabad, Telangana.

Convocation program details will be informed shortly
wishing you All The Best

With Regards
Advisory Board
GSHSTA
God Son Holy Spirit Theological Academy Regd. No 42/22

Govt. of India Darpan NITI Aayog Unique Id of VO/NGO:AP/2023/0368586
New Delhi, Bengaluru, Hyderabad, Vijayawada, Visakhapatnam
Website : www.gshsta.com



**దేవరకొండ,అక్టోబర్ 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సమాజంలో సమాచార హక్కు చట్టం పై ప్రజలు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం మరింత పెరిగిందని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ అన్నారు. హైదరాబాదులో సోమవారం నాడు డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ యు ఎస్ ఏ వారు గౌరవ డాక్టరేట్ పట్టాను నల్లగొండ జిల్లా గుండ్లపల్లి (డిండి) మండలం కొత్త తండా కు చెందిన సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ చేసిన సేవలను గుర్తించి ఘర్షణ శ్రీనివాస్ పుష్ప రాజశేఖర్ సినీ ప్రముఖుల చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఆర్.టి.ఐ సమాచార హక్కు చట్టం పై ప్రజలలో అవగాహన కల్పిస్తూ ప్రజల కోసమే రూపొందించబడిన ఆర్టిఐ పై ప్రజలలో మరింత మేలుకొలుపును పెంపొందించే దిశగా ముందుకు వెళుతున్న క్రమంలో ఇలాంటి గౌరవ డాక్టరేట్ ను అందించడం శుభ తరుణమని ఆయన అన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ పట్టా అందుకోవడంతోపాటు మరింత బాధ్యత పెరిగిందని ప్రజలు ప్రభుత్వం రూపొందించిన చట్టాలను వినియోగించుకోవాలని ప్రతి ఒక్కరికి చట్టంలో ప్రశ్నించే అధికారం ఉందని ప్రజలు ప్రభుత్వ అధికారులు పనితీరులోనీ ప్రజల స్వంతమైన చట్టపరమైన అంశాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. రానున్న రోజులలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలలో అవగాహన కొరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయబోతున్నామని ప్రజలు సమాజం పట్ల బాధ్యత కలిగిన యువకులు ముందుకు రావాలని ఆయన తెలిపారు.

# ఎంపిటిసి-జడ్పిటిసి ఎన్నికలపై బీజేపీ ప్రణాళిక

**ఎల్కతుర్తి, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో బీజేపీ అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో 12 స్థానాల్లో విజయాన్ని సాధించాలని, ముఖ్యంగా జడ్పిటిసి స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తూ ఇంటింటి



ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. 'అందరికీ ఇచ్చారు అవకాశం ౧ బీజేపీకి ఇవ్వండి అవకాశం" అనే నినాదంతో ముందుకు సాగాలని, కేంద్ర పథకాలను ప్రతి గడపకు చేరవేయాలని కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో మండల మాజీ అధ్యక్షులు కుడతడి చిరంజీవి, సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, జనగాని కిష్టయ్య, తాజా మాజీ సర్పంచులు, శక్తి కేంద్ర ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం అభివృద్ధికి మరో ముందడుగు

-ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ ఆదేశాల మేరకు రోడ్డు పనులు ప్రారంభం





**గోదావరిఖని, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు గోదావరిఖని బి టైపు గెస్ట్ హౌస్ వద్ద మూలా పలుపు ప్రాంతంలో రోడ్డు వెడల్పు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల సమక్షంలో హెచ్‌కేఆర్ ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభించగా, కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి ముఖ్య పాత్ర పోషించారు. ఈ సందర్భంగా మహంకాళి స్వామి మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఈ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తవాలని అధికారులను కోరినట్టు తెలిపారు. రామగుండం అభివృద్ధికి శాసనసభ్యులు మక్కాన్ సింగ్ ఠాకూర్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అదే రోజు ఎన్టిపిసి పరిధిలోని ఎఫ్‌సీఐ సెంటర్‌లో కూడా రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ అధ్యక్షుడు ఎండి ఆసిఫ్ పాషా నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలని మహంకాళి స్వామి, ఆసిఫ్ పాషా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు దీటి బాలరాజ్, గడ్డం శ్రీనివాస్, సింగరేణి శ్రీనివాస్, పంజా శ్రీనివాస్, విజయ్, మడిపల్లి మల్లేష్, బొడిగె భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ -జడ్పీటీసీ సన్నాహక సమావేశం


అక్కన్నపేట మండలంలో బీజేపీ అభ్యర్థుల విజయానికి పిలుపు



**అక్కన్నపేట, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అక్కన్నపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రామచంద్ర మహేందర్ రెడ్డి అధ్యక్షతన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హాజరై, రానున్న ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గ్రామాల అభివృద్ధికి నిధులు అందిస్తూ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ లాగా లేకపోయినా ప్రతి గ్రామానికి తోడ్పాటునిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం నుంచి నిధులు విడుదలవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గ్రామపంచాయతీలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు, సిబ్బంది జీతాల సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొంటూ, బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి పథంలోకి వస్తాయని అన్నారు. "ఢిల్లీ నుంచి బీజేపీ, గల్లీ నుంచి బీజేపీ" అనే నినాదంతో ప్రతి గ్రామంలో కమలం పువ్వు వికసించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి వీరాచారి, అసెంబ్లీ కోకోనర్ జనగామ వేణుగోపాలరావు, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, సీనియర్ నాయకులు మోహన్ నాయక్, తీగల శ్రీనివాస్ గౌడ్, గులోతూ తిరుపతి నాయక్, మాజీ సర్పంచ్ మాలోత్ రాజకుమార్, బానోత్ రవీందర్, జంగపల్లి శ్రీనివాస్, మేడబోయిన సరూప్, గాద రాజిరెడ్డి, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# 40 లక్షల రూపాయల బీ.టి. రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎల్.జి. విస్టాస్ కాలనీలో పాల్గొన్న ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



**కొంపల్లి, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎల్.జి. విస్టాస్ కాలనీలో బీ.టి. రోడ్డు పూర్తిగా పాడవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెలలో సమస్యను నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి తెలియజేయగా, ఆయన స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి ప్రత్యేక నిధుల ద్వారా రూ.40 లక్షలు మంజూరు చేయించారు. సోమవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డిని కాలనీవాసులు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శివకుమార్ గౌడ్, జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, ఎక్స్ వార్డు మెంబర్ కావాలి గోపాల్ ముదిరాజ్, ఎక్స్ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, జైబెరి గోపాల్ రెడ్డి, అంజి ముదిరాజ్, నాగరాజు యాదవ్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, భాగ్యరెడ్డి, రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైదాపూర్‌లో ఎన్నికల శిక్షణ

80 మంది అధికారులకు అవగాహన



**సైదాపూర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రెసైడింగ్, అసిస్టెంట్ ప్రెసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది అధికారులకు ఎన్నికల విధానాలు, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ శ్రీనివాస్, ఏపీవో బషిరొద్దిన్, శిక్షణాధికారి మాధవరావు పాల్గొన్నారు.

# పౌర గ్రంథాలయాల్లో వెలుగులు నింపిన నిత్య విద్యార్థి

## గ్రంథపాలకుడిగా జీవించిన కట్టా నాగయ్యకు జ్ఞాపకాంజలి



**వలిగొండ, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ గ్రంథాలయ సంఘం కార్యదర్శి డాక్టర్ రవి కుమార్ చేగోని మాట్లాడుతూ, పౌర గ్రంథాలయాలను జ్ఞాననిధులుగా భావించి, వనరుల కొరత మధ్య ప్రజల సహకారంతో సేవల విస్తరణకు కృషి చేసిన నిబద్ధ గ్రంథపాలకుడు కట్టా నాగయ్య జీవితమే ఒక స్ఫూర్తి అని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ స్వగ్రామంగా, నల్గొండలో విద్యను పూర్తి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ శాస్త్రం, జర్నలిజం, ఎం.ఫిల్ చదువుతూ ఆంధ్రభూమి, వార్తా పత్రికల్లో రిపోర్టర్‌గా సేవలందించారు. అనంతరం పౌర గ్రంథాలయ శాఖలో అసిస్టెంట్ గ్రంథపాలకునిగా చేరి చిలుకూరు, వలిగొండ, నల్లగొండ కేంద్ర గ్రంథాలయాల్లో వినూత్న కార్యక్రమాలతో పాఠకుల ఆదరణ పొందారు. చిలుకూరు బాపూజీ గ్రంథాలయంలో దాతల సహకారంతో పత్రికల సేకరణ, క్విజ్, వ్యాస రచన, పాటల పోటీలు, "టాలెంట్ టెస్ట్" వంటి కార్యక్రమాలు నిర్వహించి పాఠకుల సంఖ్య పెంచారు. వలిగొండలో విద్యుత్ సౌకర్యం లేకపోయినా దాతల సహాయంతో అభివృద్ధి సాధించారు. 2007లో "సైన్స్ ఫేర్" నిర్వహించి ప్రజల్లో గ్రంథాలయాలపై ఆసక్తి పెంచారు. 2010లో ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు పొందారు. వలిగొండ గ్రంథాలయానికి కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించి రాష్ట్రంలో తొలి డిజిటల్ పౌర గ్రంథాలయంగా నిలిపారు. నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాల సరఫరా, అవగాహన సదస్సులు, స్ఫూర్తి కార్యక్రమాలు, సీసీటీవీ ఏర్పాటు, భోజన పథకం, మొక్కల నాటకం, ఏసీ సదుపాయాలతో పాఠకులకు మెరుగైన సేవలు అందించారు. 30 ఏళ్ల సేవలో ఎప్పుడూ ఆలస్యం లేకుండా విధులు నిర్వహించిన కట్టా నాగయ్య, రెండు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డులు, 2023లో తెలంగాణ గ్రంథాలయ పరిషత్ సన్మానం పొందారు. అక్టోబర్ 3న ఆయన మరణించగా, పాఠకుల హృదయాల్లో నిత్యం జీవించే వ్యక్తిగా, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచారు.

# కరీంనగర్ ప్రధాన ఆస్పత్రిలో న్యాయ సహాయ కేంద్రం

మాదకద్రవ్యాల బాధితులకు ఉచిత న్యాయ సేవలు







**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన మాదకద్రవ్యాల అవగాహన మరియు వెల్నెస్ నావిగేషన్ పథకంలో భాగంగా, కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో న్యాయ సహాయ కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాల బారిన పడిన బాధితులకు మరియు వారి కుటుంబ సభ్యులకు న్యాయ సహాయం అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. న్యాయ సలహా మరియు సహాయం కోసం ఒక న్యాయవాది, ఒక పారా లీగల్ వాలంటీర్‌ను నియమించినట్టు వెల్లడించారు. మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, మానసిక ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ చూపాలని సూచించారు కార్యక్రమంలో హాస్పిటల్ పర్యవేక్షణ అధికారి వీరారెడ్డి, లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్, మానసిక రోగుల విభాగ అధిపతి అజయ్ కుమార్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా చిట్టీ నిర్వహణ

బంపర్ డ్రా నిర్వాహకులపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు




**హుస్నాబాద్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణ గాంధీ చౌరస్తాలో కనకదుర్గమ్మ మండపం వద్ద అనుమతి లేకుండా బంపర్ డ్రా పేరుతో చిట్టీ నిర్వహించిన కొత్తపెల్లి అశోక్, దొడ్డి శ్రీనివాస్, కొండూరు కిరణ్ తదితరులపై బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ సోమవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. లక్షల రూపాయలు వసూలు చేసి బహుమతుల పేరిట ప్రజల సొమ్ము దోపిడీ చేశారని, వసూలు చేసిన మొత్తాన్ని రికవరీ చేసి ఇకపై ఇటువంటి చిట్టీలకు అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బహుమతుల వివరాలు అడిగినప్పుడు నిర్వాహకులు బీజేపీ నాయకులమంటూ దాడికి పాల్పడుతున్నారని, కేంద్ర మంత్రి బండి సంజయ్ తమ వెనుక ఉన్నారని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని బీఎస్పీ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు వెలుపల రాజు, సీనియర్ నాయకులు మారపల్లె సుధాకర్, ఎలగందుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్సీ తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

ఉచిత మందుల వినియోగంపై అవగాహన కల్పించిన వెంకటరమణ



**చిగురు మామిడి, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురు మామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పీఓ ఎంహెచ్‌ఎన్ డాక్టర్ సనా జవేరియా సోమవారం తనిఖీ చేశారు. అటెండెన్స్, అవుట్ పేషెంట్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలు, మందుల పంపిణీ తీరును పరిశీలించారు. అవుట్ పేషెంట్లతో మాట్లాడి ఉచిత మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో సేవలపై స్పందన తెలుసుకున్నారు. ఫార్మసీ స్టోర్‌లో సీజనల్ వ్యాధుల మందుల నిల్వలను, ప్రసూతి గది పరిశుభ్రతను, అత్యవసర మందుల లభ్యతను పరిశీలించారు. మొదటి కాన్పులకు సిజేరియన్ చేయడం వల్ల కలిగే సమస్యలను వివరించి, సాధారణ డెలివరీల కోసం గర్భవతులను ప్రోత్సహించాలని సూచించారు. పీహెచ్సీ డెలివరీలు మెరుగుపర్చాలని సూచించారు. తర్వాత ముల్కనూర్, అల్గునూర్ హెల్త్ వెల్నెస్ సెంటర్లు, కట్టరాంపూర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, ఎంఎల్‌హెచ్‌పీ మంజుల, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వొడితల ప్రణవ్‌ను కలిసిన గౌడ సంఘం

**ఎస్డీఎఫ్ నిధుల మంజూరుకు కృతజ్ఞతలు**



**ఇల్లందుకుంట, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుజురాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందుకుంట గ్రామ గౌడ సంఘ నాయకులు సోమవారం వొడితల ప్రణవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని ఎల్లమ్మతల్లి దేవాలయ అభివృద్ధికి ఎస్డీఎఫ్ నిధుల ద్వారా రూ.10 లక్షలు మంజూరైన నేపథ్యంలో, ఈ విషయాన్ని పార్టీ ఇంచార్జ్‌కు వివరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**రేకుర్తిలో భూమిపూజ చేసిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా రేకుర్తి లక్ష్మీ నరసింహ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుడు మహమ్మద్ అబ్దుల్లా ఇంటికి సోమవారం భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రానివారు ఆందోళన చెందవద్దని, రెండో విడతలో అవకాశం కల్పిస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చుతుందని పేర్కొన్నారు. భూమిలేని నిరుపేదలకు గాంధీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కొంతమందికి అప్పగించి ఆదుకుంటామని తెలిపారు. మహమ్మద్ అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయి తినిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆస్తాపురం రమేష్, ఎండి చాంద్, ఊరడి లత, అస్తపురం తిరుమల, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పర్వతం మల్లేశం, ఆవూరి లత, వారాల నర్సింగం, లక్కెపెల్లి మల్లేశం, మ్యాక శ్రీనివాస్, దుబ్బుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

**రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించిన కల్వకుర్తి శాసనసభ్యుడు**



**కల్వకుర్తి, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది క్షణికావేశంలో జరిగిన ఘటన కాదని, పథకం ప్రకారం కుట్రపూరితంగా జరిపిన దాడి అని ఆయన పేర్కొన్నారు. "సుప్రీంకోర్టు భారత రాజ్యాంగానికి కస్టోడియన్. దాని ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం అంటే రాజ్యాంగంపై దాడి చేసినట్టే," అని ఎమ్మెల్యే నారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, దానిపై దాడి చేయడం దేశ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం అందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలను ప్రసాదించిందని, వాటిని కాపాడడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఎమ్మెల్యే నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

# కార్మిక హక్కుల సాధనకుఏఐటియుసీ ముందుండాలి





**జీడీకే వన్ ఇంక్లైన్‌లో మెంబర్‌షిప్ ప్రారంభం**



**గోదావరిఖని, అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గోదావరిఖని జీడీకే వన్ ఇంక్లైన్‌లో సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసీ)కు కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఎనిమిది దశాబ్దాలుగా ఏఐటియుసీ కార్మిక హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తూ, సంస్థ పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తోందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, అధికారిక పదవులు లేకుండానే కార్మికుల అండతో సమ్మెలు చేసి హక్కులు సాధించిన చరిత్ర ఏఐటియుసీ సొంతమని పేర్కొన్నారు. గుర్తింపు సంఘంగా ఏడవసారి విజయం సాధించిన తరువాత, యాజమాన్యంతో చర్చలు జరిపి హామీల అమలుకు కృషి చేస్తున్నామని తెలిపారు. యూనియన్ బలోపేతానికి అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకోవాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, నాయకులు కలవేణి రాజేష్, కొరిమి శ్రావణ్ కుమార్, సమ్మయ్య, నగేష్, వెంకటేష్, ఎర్రగొల్ల చేరాలు, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం..

## పదవి చేపట్టిన నెలరోజులకే ప్రధాని సెబాస్టియన్ రాజీనామా

**న్యూఢిల్లీ అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఫ్రాన్స్ నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను తాజాగా రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే అధికారం నుంచి ఆయన దిగిపోయారు . గత నెల జాతీయ అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధాని ఫ్రాంకోయిస్ బేరౌ ఓడిపోవడంతో.. సెబాస్టియన్‌ను తదుపరి ప్రధానిగా అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రన్ నియమించిన విషయం తెలిసిందే.ఆ తర్వాత సెబాస్టియన్ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజకీయ పార్టీలతో వారాల తరబడి సంప్రదింపులు జరిపిన అనంతరం ఆదివారం తన మంత్రివర్గాన్ని కూడా నియమించారు. నేడు మంత్రివర్గం తొలి సమావేశం కూడా నిర్వహించనుంది. మంత్రివర్గాన్ని




నియమించిన గంటల వ్యవధిలోనే ప్రధాని సెబాస్టియన్ రాజీనామా చేయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఆయన రాజీనామాను అధ్యక్షుడు మాక్రన్ ఆమోదించినట్లు తెలుస్తోంది.కాగా, గత రెండేళ్లలో ఫ్రాన్స్‌లో రెండుసార్లు తాత్కాలిక ప్రభుత్వం నడిచింది. ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రధాని విషయంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రధాని నియామకం మాక్రన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ఆయన వద్ద రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. కొత్త ప్రధానిని నియమించడం లేదా జాతీయ అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించడమే. గత రెండేళ్ల నుంచి ఇదే సమస్య వస్తున్నా.. ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రం దేశాధ్యక్షుడు మొగ్గు చూపలేదు. ఒకవేళ ఈసారి ఎన్నికలకు వెళ్తే, ప్రభుత్వాన్ని రద్దు చేసిన 29 నుంచి 49 రోజుల మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అత్యధిక సీట్లు గెలిచిన పార్టీ నుంచి ప్రధాని వ్యక్తిని అధ్యక్షుడు నియమిస్తారు.

# వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**రోగ నిరోధక వ్యవస్థలో కొత్త ఆవిష్కరణలకు పురస్కారం**

**స్టాకహోం అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రోగ నిరోధక వ్యవస్థకు సంబంధించిన కొత్త ఆవిష్కరణలకు ఈ ఏడాది వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి ముగ్గురిని వరించింది. జపాన్‌కు చెందిన షిమోన్ సకాగుచి, అమెరికాకు చెందిన మేరీ ఇ.బ్రుంకొవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్‌లు ఈ బహుమతిని పంచుకోనున్నారు. రోగ నిరోధక వ్యవస్థలో సెక్యూరిటీ గార్డులుగా పిలిచే రెగ్యులేటరీ టి కణాలను వీరు గుర్తించారు. రోగ నిరోధక కణాలు మన శరీరంపైనే దాడి చేయకుండా ఈ టి కణాలు అడ్డుకుంటాయని వారు గుర్తించారు. రోగ నిరోధక వ్యవస్థ ఎలా పని




చేస్తుంది, మనందరిలోనూ తీవ్రమైన ఆటో ఇమ్యూన్ వ్యాధులు ఎందుకు వృద్ధి చెందవో అర్థం చేసుకోవడానికి ఈ ఆవిష్కరణలు బాగా ఉపయోగపడతాయని నోబెల్ కమిటీ ఛైర్మన్ ఓలె కాంపె వ్యాఖ్యానించారు. ఆటో ఇమ్యూన్ వ్యాధులు, కేన్సర్లకు కొత్త చికిత్సలను అభివృద్ధిపరచడానికి ఈ ఆవిష్కరణలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ఆటో ఇమ్యూన్ వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించే రోగ నిరోధక కణాలను షిమోన్ సకగుచి తొలుత 1995లో కనుగొన్నారు. ఆ తర్వాత 2011లో ఆ కణాలు పనిచేయడానికి కీలకమైన జన్యువును అమెరికన్ పరిశోధకులు మేరీ, ఫ్రెడ్ కనుగొన్నారు. రెండేళ్ల తర్వాత సకగుచి ఈ ఆవిష్కరణలన్నింటినీ అనుసంధానిస్తూ తాను గుర్తించిన ఈ టి కణాల అభివృద్ధికి ఫాక్స్ పి3 జన్యువు కారణమవుతోందని రుజువు చేశారు. ముందుగా వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించడంతో ఇక వరుసగా ఈ వారమంతా వివిధ విభాగాల్లో నోబెల్ బహుమతులు ప్రకటిస్తారు. చివరిగా నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడుతుంది. వీరందరికీ డిసెంబరు 10న బహుమతి ప్రదానం వుంటుంది.

# రాజస్థాన్ ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



**న్యూఢిల్లీ అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆదివారం రాత్రి జైపూర్‌లోని సవాయి మాన్ సింగ్ హాస్పిటల్‌లో ట్రామా కేర్ విభాగంలో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగడంతో ఆరుగురు అగ్నికి అహుతయ్యారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని రాజస్థాన్ ప్రభుత్వాన్ని ఆమె కోరారు. ఈమేరకు ఆమె సోమవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

# 251 ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసిన రష్యా



**మాస్కో అక్టోబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సుమారు 251 ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యలు చేపట్టిన తర్వాత కీవ్ చేపట్టిన అతిపెద్ద ప్రతీకార దాడుల్లో ఇది ఒకటి. ఆదివారం రాత్రి సమయంలో వైమానిక రక్షణ హెచ్చరిక వ్యవస్థలు 251 ఉక్రెయిన్ ఫిక్స్‌డ్-వింగ్ మానవరహిత డ్రోన్‌లను అడ్డగించి, ధ్వంసం చేశాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. క్రిమియాపై 40 డ్రోన్‌లను, అలాగే నల్ల సముద్రంపై 62 డ్రోన్‌లను రష్యన్ దళాలు కూల్చివేశాయని పేర్కొంది. కుర్స్క్ మరియు బెల్గోరోడ్ ప్రాంతాలపై, అలాగే ఇతర ప్రాంతాలపై డజన్ల కొద్దీ డ్రోన్‌లను కూల్చివేసినట్లు వెల్లడించింది.






## మాస్ ఇమేజ్ కోసం ట్రై చేస్తున్న నాగ శౌర్య..

### టీజర్‌తో పెరిగిన అంచనాలు

టాలీవుడ్ యంగ్ హీరో నాగ శౌర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేశారు. టీజర్ నిడివి తక్కువగా ఉన్నా అందులో చూపించిన విజువల్స్, డైలాగ్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. "బ్యాడ్ బాయ్ అనుకుంటే.. స్మార్ట్ బాయ్ లా ఉన్నావ్!" అనే డైలాగ్‌తో మొదలైన ఈ టీజర్‌లో నాగశౌర్య ఎనర్జిటిక్ మాస్ అవతారాన్ని ప్రదర్శించాడు. ఇప్పటి వరకు నాగశౌర్య చేసిన సాఫ్ట్ బాయ్ ఇమేజ్‌కు భిన్నంగా, ఈసారి యాక్షన్ మోడ్‌లో కనిపించనున్నాడు. టీజర్‌లో సాయి కుమార్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో, పూర్ణ సీరియస్ లుక్‌తో కనిపిస్తూ కథకు బలమైన బేక్‌డ్రాప్ ఉందని సూచిస్తున్నారు. ఈ మూవీ యాక్షన్, ఎమోషన్ మిక్స్‌తో వినోదాత్మకంగా ఉండబోతోందని టీజర్ చెప్పకనే చెబుతోంది. ప్రముఖ సంగీత దర్శకుడు హరీష్ జైరాజ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. అలాగే ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు కట్స్ టీజర్ టోన్‌ను మరింత షార్ప్‌గా మలిచాయి. ఈ చిత్రానికి రామ్ దేసిన దర్శకత్వం వహిస్తున్నారు. విధి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాణం జరుపుతున్న ఈ చిత్రం, ఆ బ్యానర్ నుంచి వస్తున్న తొలి సినిమా కావడం విశేషం. నాగశౌర్య ఈ సినిమా ద్వారా తన కెరీర్‌లో మరో మాస్ హిట్‌ను నమోదు చేయనున్నాడా? అనే విషయంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. టీజర్ చూస్తే మాత్రం మంచి మాస్, కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా అనిపిస్తోంది. 'బ్యాడ్ బాయ్ కార్తీక్' త్వరలో విడుదల కానుంది. మరి సినిమా ఎంత వరకు ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి. చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.



## బ్లాక్ డ్రెస్సులో జాన్వీ కపూర్ గ్లామర్ షో

ముంబై: జాన్వీ కపూం తన ఫ్యాషన్ లుక్స్‌తో స్టన్ చేస్తోంది. జాన్ గల్లియానో బ్లాక్ కలర్ డ్రెస్సులో జిగేల్మంది ఆ బ్యూటీ. 1986 ఫాలన్ ఏంజిల్స్ కలెక్షన్‌కు చెందిన డ్రెస్సింగ్‌ను జాన్వీ ధరించింది. ఫ్రాన్స్ ఉద్యమ కాలంతో 1986 కలెక్షన్‌కు లింకు ఉన్నది. ప్రాచీన గ్రీకు, రోమన్స్‌కు చెందిన సాధారణ స్టయిల్‌లో డ్రెస్సు ఉంటుంది. గల్లియానో డిజైన్‌లో చాలా లైటర్ ఫ్యాబ్రిక్స్ ఉంటాయి. బ్లాక్ చార్‌కోల్ షేడ్‌లో ఉన్న సీజర్ ప్లీట్ డ్రెస్సును జాన్వీ వేసుకున్నది. ఆ ఔట్‌ఫిట్‌కు స్కాలోప్ నెక్‌లైన్ ఉంది. లాంగ్ స్లీవ్స్, కర్వ్ పౌచ్ ప్యాకెట్లు కూడా ఉన్నాయి. ఇక షర్ట్‌కు కూడా క్రాసోవర్ సీజర్ కట్టింగ్‌తో డిజైన్ ఉంది. రియా కపూర్ ఈ డ్రెస్సును స్టయిల్ చేసింది. ఈ ఔట్‌ఫిట్‌కు తగినట్లు హై హీల్స్ వేసుకుంది జాన్వీ. క్లచ్ అండ్ డార్క్ సన్‌గ్లాసెస్ కూడా పెట్టుకుంది ఆ క్యూటీ.

## గ్లామర్ విషయంలో తగ్గేదేలేదంటున్న కృతి శెట్టి!

ఉప్పెన సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన అందాల ముద్దుగుమ్మ కృతిశెట్టి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. ఈ బ్యూటీ తన అంద చందాలతో ఎంతో మంది మదిని దోచేసింది. చిత్ర పరిశ్రమలోకి అడుగు పెడుతూనే బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. మొదటి సినిమాతోనే 100 కోట్ల క్లబ్‌లో చేరి, స్టార్ హీరోయిన్ రేంజ్‌లో అందరినీ ఆకట్టుకుంటుంది. దీంతో ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్‌నే ఏలేస్తుందని అందరూ అనుకున్నారు. అనుకున్నట్లుగానే వరసగా అవకాశాలు అందిపుచ్చుకొని, వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. కానీ ఈ బ్యూటీకి అదృష్టం అంతగా కలిసి రాలేదు, చేసిన సినిమాలన్నీ చాలా వరకు డిజాస్టర్ అవ్వడంతో టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో కోలీవుడ్, మాలీవుడ్ చక్కేసి, అక్కడ వరసగా సినిమాలు చేస్తూ తన లక్కు పరీక్షించుకుంటుంది. అయితే ఈ బ్యూటీ అక్కడ కూడా వరసగా ఆఫర్స్ అందుకుంటున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో మాత్రం గుర్తింపు సంపాదించుకోవడం లేదని టాక్. ఇక ఏదీ ఎలా ఉన్నా ఈ ముద్దుగుమ్మ మాత్రం ఈ మధ్య సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ అయిపోయింది. తన గ్లామర్‌తో కుర్రకారును మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ చీరలో గ్లామర్ తో చంపేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



## నందిత లేటెస్ట్ పిక్స్ అదుర్స్

## సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తున్న బ్యూటీ..

చాలా మంది ముద్దుగుమ్మలు అందం అభినయం ఉన్న అవకాశాలు అందుకోవడం కోసం చాలా కష్టపడుతూ ఉంటారు. అవకాశాల కోసం ఎదురుచూస్తున్న బ్యూటీలు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు వారిలో ఈ అమ్మడు ఒకరు. తెలుగులో 13 సినిమాలు చేసినా కూడా ఈ చిన్నదానికి ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. ఇంతకూ ఈ ముద్దుగుమ్మ ఎవరో తెలుసు కదా.. ఆమె నందిత శ్వేతా. ఈ చిన్నది.. తెలుగు, తమిళ్, కన్నడ భాషల్లో సినిమాలు చేసి మెప్పించింది ఈ అందాల భామ. ఎక్కడికి పోతావు చిన్నవాడా సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ బ్యూటీ. 2016లో వచ్చిన ఎక్కడికి పోతావు చిన్నవాడా సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో నందిత శ్వేత పేరు మారుమ్రోగింది. ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించి మెప్పించింది. ఆ తర్వాత ఈ అమ్మడికి వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. టాలీవుడ్ లో బ్యాక్ బ్యాక్ సినిమాలు చేస్తుంది. ఆతర్వాత శ్రీనివాస కళ్యాణం, బ్లఫ్ మాస్టర్, ప్రేమకథ చిత్రం 2 సినిమాల్లో నటించింది. కానీ మంచి హిట్ మాత్రం అందుకోలేకపోయింది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ క్రేజీ ఆఫర్స్ కోసం ఎదురుచూస్తుంది ఈ వయ్యారి భామ. ఇక సోషల్ మీడియాలో రకరకాల ఫొటోలతో ఆకట్టుకుంటుంది నందిత. తాజాగా ఈ అమ్మడి ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ కుర్రదాని ఫొటోల పై మీరూ ఓ లుక్కేయండి.



## ట్రెడిషనల్ లుక్‌లో అదరగొట్టిన రెజీనా..

### -బుట్టబొమ్మలా భలే ఉందిగా..

రెజీనా కాసాండ్రా.. తెలుగు, తమిళం,కన్నడ సినిమాల్లో నటిస్తూ అలరిస్తుంది. ఈ ముద్దుగుమ్మ 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. చిన్న వయస్సులోనే సినిమా రంగంలోకి అడుగుపెట్టిన రెజీనా, 2005లో తమిళ చిత్రం "కండా నాల్ ముదల్"తో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది.తెలుగులో "శివ మనసులో శృతి" (2012) ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు "సైమా ఉత్తమ తొలి చిత్ర నటి" అవార్డు కూడా వచ్చింది. రెజీనా తెలుగులో "రొటీన్ లవ్ స్టోరీ", "పిల్లా నువ్వు లేని జీవితం", "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్", "పవర్" వంటి సినిమాల్లో నటించి క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది.తమిళంలో "కేడి బిల్లా కిల్లాడి రంగా", "మానగరం" వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రశంసలు పొందింది.ఈ బ్యూటీ విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటుంది. "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్"లో సాంప్రదాయ అమ్మాయి, "జ్యో అచ్యుతానంద"లో డెంటల్ స్టూడెంట్, "అ"లో డ్రగ్ అడిక్ట్ వంటి పాత్రల్లో తన సత్తా చాటింది.ఈ భామ బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టింది. 2019లో "ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగా విడుదలైన సన్నీ డియోల్ "జాట్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. అలాగే, వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ తన సత్తా చాటుతుంది.రెజీనా ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విభిన్న ప్రాజెక్టులతో బిజీగా ఉంది, అలాగే సోషల్ మీడియాలో కూడా తన అందమైన ఫోటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా కొన్ని ఫోటోలను వదిలింది రెజీనా. ఈ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.